ఇలువేలుపు వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

సుధీర కథనాలు

(కథా సంకలనం)

రాంభట్ల వేంకటరాయ శర్మ

డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్
విశాఖపట్నం

2016

DAKJ103B157

అంకితం

అక్షరలక్షగాయత్రీమంత్రోపాసకులు

కీ.శే. రాంభట్ల లక్ష్మీనరసింహా సోమయాజులు గారికి

డి.ఎం.ఎల్.టి.

సభక్తికంగా మీ పుత్రుడు

రాంభట్ల వేంకటరాయశర్మ

(సుధీరు)

కృతజ్ఞతలు

జన్మనిచ్చిన తల్లిదండ్రులైన సూర్యకాంతకామేశ్వరి,
లక్ష్మీనరసింహసోమయాజులు గార్లకు,
సాహిత్యంపట్ల, జ్యోతిషంపట్ల ఆసక్తిపెంచి, అటువైపు
అడుగులు వేయించిన
తాతగారు రాంభట్ల పార్వతీశ్వర శర్మగారికి,
సాహిత్యంలో చేదోడు వాదోడుగా ఉంటున్న తమ్ముడు చి॥
రాంభట్ల పార్వతీశ్వరశర్మ శతావధానికి, అక్కబావలకు,
ఆత్మీయతతో ఈ కథాసంకలనానికి ఆశీ:పూర్వక
ఆముఖాన్ని అందించిన 'ఆచార్య సార్వభౌమ' వేదుల
సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి కృతజ్ఞతలు.

నన్నెప్పటికప్పుడు సాహిత్యంలోను, జ్యోతిషంలోను
ప్రోత్సహించి ముందుకు నడిపించడమేకాక ఈ
కథాసంకలనం పుస్తకరూపంలో వెలుగుచూడడానికి
ప్రధాన భూమికవహించిన దాతలు అమ్మమ్మ, తాతగారు
శ్రీమతి & శ్రీ పిళ్ళా రాజరాజేశ్వరి, భగీరథరావు
దంపతులకు,
మరియు
అమ్మమ్మ రాంభట్ల సుబ్బలక్ష్మిగారికి
ప్రత్యేకమైన కృతజ్ఞతలు

రచయిత

కె. దాదా

ఇలువేలుపు

శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

సుధీర కథనాలు

(కథా సంకలనం)

రాంభట్ల వేంకటరాయశర్మ

డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్

విశాఖపట్నం

2016

SUDHEERA KATHANALU
(TELUGU SHORT STORIES)

by
R. V. R. SHARMA

సుధీర కథనాలు

(కథా సంకలనం)

రాంభట్ల వేంకటరాయ శర్మ

I Edition : 2016
ప్రథమముద్రణ : దుర్ముఖి నామసంవత్సరం

Copies : 500

Rs. : 50/-

ISBN : 978-93-5258-898-5

Pages : 50

Published by :
DR. RAMBHATLA VENKATARAO MEMORIAL TRUST
CHINAMUSHIDIWADA, VISAKHAPATNAM.
Cell : 9393122394, 9985243171.

All Rights Reserved

Printed at :
SATHYAM OFFSET IMPRINTS,
MADHURA NAGAR, VISAKHAPATNAM,
Cell : 9849996538

ఇందులో...

శుభోక్తి - 'ఆచార్య సార్వభౌమ' వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి

1. సిలబస్‌లో బంధుత్వం - 06

2. శ్రీశ్రీ అంతరంగం - 09

3. మేలుకొలుపు - 18

4. ఆ నలుగురూ... సరస్వతీపుత్రులు - 21

5. యజ్ఞాశ్వం - 31

6. నిశీథిసంధ్య - 45

కథాశ్రీకారం - 'శతావధాని' రాంభట్ల పార్వతీశ్వరశర్మ

'ఆచార్య సార్వభౌమ'
ప్రొ॥ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి
M.A. Ph.D. (Telugu), M.A. Ph.D. (Sanskrit)
Retired Professor & Former Head of the Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

శారదాపీఠం,
46-15-35, దొండపర్తి,
విశాఖపట్నం-530016.
ఫోన్ : 0891-2541003
సెల్ : 9490084217

శుభోక్తి

చిరంజీవి రాంభట్ల వేంకటరాయ శర్మ విద్వద్వంశసంజాతుడు. శ్రద్ధాళువు. నిత్యజిజ్ఞాసువు. బహు వినీతుడు. ఆంధ్ర సాహిత్యంలో ఎం.ఏ. పట్టభద్రుడు. యు.జి.సి. వారి నెట్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు విభాగంలో పిహెచ్.డి. పట్టాకి పరిశోధనగావిస్తున్న పరిశోధకుడు. తాను అప్పుడప్పుడు రచించిన వివిధ పత్రికలలో ప్రచురింపబడిన ఆరు కథలను స్వీకరించి "సుధీర కథనాలు" అనే సంకలన గ్రంథంగా లోకానికి అందించడం సాహిత్య పిపాసువులకి షడ్రసోపేత భోజనమే అవుతుంది.

మానవునిలోని ఊహ మొలకెత్తినప్పటి నుండి కథారచన ఆరంభమవుతుంది. ఆదిని అది మౌఖికదశలోనే ఉంటుంది. అనంతరం కొంత కాలానికి అక్షరాకృతిని సంతరించుకుంటుంది. కథాసాహిత్యానికి భారతదేశం తరగని గని. పంచతంత్ర కథలు ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించుకొంటున్నాయి. బైబిలు తర్వాత పంచతంత్రం ఎక్కువ పాశ్చాత్య భాషానువాద గౌరవం అందుకొందని విమర్శకులు పరిగణిస్తున్నారు.

ఆధునికాంధ్ర సాహిత్యంలో వచన విభాగానికి చెందిన కథానిక పాశ్చాత్య సాహిత్య ప్రభావంచే ఆవిర్భవించింది. బహుముఖవికాసాన్ని సంతరించుకుంటోంది. స్త్రీపురుషులు, బాలురు, వృద్ధులు అందరూ ఆదరించే ప్రక్రియ నేటి కథానిక. క్లుప్తత, విషయనిర్భరత, సమాజంలోని దౌర్గత్యాన్ని కరుణ రసార్ద్రంగా హృదయానికి హత్తుకునేటట్లు సన్నివేసాలు చిత్రించడం మున్నగునవి కథానికలక్షణాలు. ఆరంభం నుండి పాఠకునిలో ఉత్కంఠతని పెంచడం కథానికలోని విశిష్టలక్షణం. సమాజాన్ని జాగృతం చేయడంలో కథానిక (Short Story) ప్రముఖ పాత్ర వహిస్తోంది.

ఈ కథా సంకలనంలో (1) విషయ వైవిధ్యం (2) నేటి ప్రజా జీవనవిధానం, (3) హెచ్చరిక తోడి కర్తవ్యోపదేశం (4) రచయిత యొక్క నిశిత సమాజ పరిశీలన

దక్షత అనే ధర్మాలు ప్రస్ఫుటమౌతున్నాయి. ప్రతీకథ ఉత్కంఠతో పాఠకుని తుది దాకా చదివించడం ప్రత్యేకంగా పేర్కోదగ్గ విశేషం. రచయిత యొక్క కథాకథన దక్షత అంతటా వెల్లి విరిస్తోంది. వ్యవహార ప్రసిద్ధమైన పదప్రయోగం, పాత్రోచిత సహజ సంభాషణ-లలిత మధురంగా, సహజ సుందరంగా సాగాయి. సందేశం ప్రతి కథలోనూ కొంత సమ్మితంగా నిర్వహించబడింది.

కౌటుంబిక జీవనంలో ప్రపంచంలో అగ్రగామిగా పేరొందిన భారతదేశంలో నేటి విద్యావిధానఫలంగా బంధుత్వాలు ఏ విధంగా మరుగౌతున్నాయో "సిలబస్ లో బంధుత్వం" అనే కథానికలో రచయిత చక్కగా నిరూపించాడు. నేటి సమాజంలో తెలుగుసాహిత్యం అనుభవిస్తున్న దుర్గతిని "శ్రీశ్రీ అంతరంగం" అనే కథానికలో హృదయ విదారకమైన సన్నివేశాలు వెల్లడిస్తున్నాయి. మేనరికాలవల్ల వివిధ దీర్ఘవ్యాధులు సంక్రమిస్తాయి అన్న వైద్యనిపుణుల సిద్ధాంతాన్ని రచయిత "మేలుకొలుపు" అనే కథానికలో చక్కగా తీర్చిదిద్దినాడు. వైద్యపరీక్షలలో రోగి నివసిస్తున్న పరిసరాలు, జీవన శైలి ప్రముఖ పాత్ర వహిస్తాయి అని "ఆనలుగురూ... సరస్వతీ పుత్రులు" అనే కథానిక ఉపదేశిస్తోంది. వ్యాపారంలో ద్రోహచింతన, చిన్ననాటిపగ అనే రెండు అవగుణాలకి ప్రతీకగా "యజ్ఞాశ్వం" అనే కథానిక కల్పింపబడింది. యాగాశ్వంతో 'కృష్ణ' జీవితాన్ని సరిపోల్చడం పరమాద్భుతరమణీయం. గల్ఫ్ దేశాలకి ఆడవాళ్ళని పంపడంలో విశ్వాసాన్ని కల్గించడంలో స్త్రీల అనల్ప ప్రతిభ ఎలా ఉంటుందో "నిశీథి సంధ్య" అనే కథ చక్కగా ఆవిష్కరిస్తోంది. స్త్రీలు కూడా వివిధరంగాలలో ప్రావీణ్యంపొంది సాహసకృత్యాలు నిర్వహించడంలో పురోగమించాలని ఆ కథలో ఉపదేశింపబడింది.

చిరంజీవి వర్ధిష్ణువు రాంభట్ల వేంకటరాయశర్మ ఇంకా ఇటువంటి సామాజిక స్పృహ ప్రధానములైన కథానికలు ఇతోధికంగా రచించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను.

శుభం భూయాత్

విద్వజ్జన విధేయుడు

వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

14-04-2016.

1. సిలబస్‌లో బంధుత్వం

కం. "చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగుం
చదువగ వలయును జనులకు
చదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ!"

అంటూ హాల్లో కూర్చొని వల్లె వేస్తున్నాడు వంశీ! ఇంతలో గేటు తీసుకు వస్తున్న లలితను చూసి, "అమ్మా ఎవరో వచ్చారు" అంటూ లోపలికి పరుగెత్తాడు. ఎవరొచ్చార్రా? అంటూ లలితను చూసిన కమల "ఎవరో ఎంట్రా ఈవిడ మీ దొడ్డ" రండక్కా! బావగారు రాలేదా? అంటూ పలకరిస్తూ లోపలికి ఆహ్వానించింది.

కుశల ప్రశ్నలు అయ్యాక కాఫీ తేవడానికి కమల లోపలికి వెళ్ళింది. కాఫీ తాగాక, కమలను ఇలా అడిగింది లలిత. "ఔను నన్ను చూసి ఎవరో అంటాడేంటి? మేమెవరిమో తెలియదా వాడికి? ఔన్లే సొంత దొడ్డ పెదనాన్నల గురించి కూడా తెలియకుండా పోయింది". అని అంటూ ఉంటే, "అదికాదక్కా! నాకూ మీ మరిది గారికి ఆఫీసు, పిల్లలకేమో స్కూలు. అందరం పొద్దున్న వెళితే మళ్ళీ ఏరాత్రికో ఇల్లు చేరుతాం" అని చెప్పింది కమల.

ఇంతలో వంశీ వచ్చి దగ్గర కూర్చున్నాడు. లలిత వాడ్ని దగ్గరగా తీసుకొని "ఏం చదువుతున్నావ్"? అని అడగ్గానే 8th క్లాస్" అని చెప్పాడు. "ఇంతకీ నువ్వు చదువుతున్న పద్యానికి అర్థం, తాత్పర్యం తెలుసా?" అని అడగ్గానే, తెలియదని చెప్పాడు వంశీ.

"ఇది ఎప్పుడో కృత యుగంలో సాక్షాత్తుదానవ కుల చక్రవర్తి, హిరణ్యకశిపుడు తన కుమారుడు ప్రహ్లాదునితో పలికినది. చదువు గొప్పదనం చెప్తూ, చదువుకుంటే రాక్షసుల్లో కూడా మానవత్వం, విజ్ఞత పెరుగుతాయని, తద్వారా దేశానికి, తన వాళ్ళకి ఉపయోగపడతారన్నది జగమెరిగిన సత్యం" అని చెప్పి కమలతో మాట్లాడటం మొదలుపెట్టింది లలిత.

ఐతే కలి ప్రభావమో లేక కాల వైపరీత్యమో గానీ మన విద్యార్థులు ఇందుకు భిన్నంగా మారుతున్నారన్నది ఇప్పుడిప్పుడే తెలుస్తున్న ఒక విశేషం. "విద్యార్థులంటే కేవలం ఈరోజు పెట్టుబడి పెడితే తిరిగి రేపు రెట్టింపు పొందవచ్చు" అనే ఉద్దేశంతో మాత్రమే చదువుకుంటున్నారు, చదివిస్తున్నారు.

తమ పిల్లలు తమకన్నా బాగుండాలనీ, తమకన్నా ఉన్నత స్థానాలకు చేరాలని, తల్లిదండ్రులు అనుకోవడంలో ఎటువంటి తప్పూ లేదు. ఈ ప్రయత్నంలో పిల్లలు రోజూ ఉదయం 8 గంటలకి వెళ్ళిపోవడం, తిరిగి రాత్రి 8 గంటలకి రావడం, పుస్తకాలు తిరగేయడం, లేదా టి.వి చూస్తుండటం, 9 గంటలకు పడుకోవడం, ఇది వారి జీవితంలో నిత్య కృత్యంగా మారిపోయింది.

దీని వలన పిల్లలు కొన్నింటిని కోల్పోతున్నారు. అలాగే ఏ మంచీ చెడూ వారికి తెలియకుండా పోతున్నాయి. బంధుత్వం, కుటుంబ సంబంధాలు అనే వ్యవస్థకి ఇదొక గొడ్డలి పెట్టు" అంటూ కొనసాగించింది లలిత.

"ఇది తల్లిదండ్రులను విమర్శించడమో లేక విద్యా వ్యవస్థను వ్యతిరేకించడమో కాదు కమల ! నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ చదువుకోవాలి, చదివించాలి. కానీ నేడు ఏ పెళ్ళిళ్ళకైనా వేరే ఏ వేడుకలకైనా పిల్లల హాజరు తక్కువే. కారణం సమయం లేక. ఈ మధ్య ఒక పెళ్ళిలో చూశాను, ఏం బాబాయ్ పిల్లలు రాలేదా అని అడిగా! 'లేదమ్మా! పెద్దవాడికి కాలేజి, పోనీ చిన్నవాడో? అంటే వాడికి పరీక్షలు, స్కూల్లో పంపించరు.' అని చెప్పాడు. ఇంతకీ వాడు చదువుతున్నది 5వ తరగతి. ఈ ప్రకారంగా పోతుంటే భవిష్యత్తులో మేటి విద్యావంతులు మెరుగుపడతారు కానీ అన్నదమ్ముల అనుబంధాలు, మేనత్త, మేనమామ, పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య, అమ్మమ్మ వంటి బంధుత్వాలను కూడా ఏదో ఒక తరగతిలో సిలబస్ గా పెడితేనే గాని అర్థంకాని రోజులు వస్తాయేమో..."

"అమెరికా అధ్యక్షుని వివరాలు సైతం ఠక్కున చెప్పే పిల్లలున్న ఈ రోజుల్లో, అమ్మానాన్నల అక్కచెల్లెళ్ళ గురించి, అన్నదమ్ముల గురించి తెలియదనడంలో ఎటువంటి ఆశ్చర్యం లేదు."

"పిల్లలు ఏ వేడుకలకు రావడం కుదురదు. పోనీ మనం వాళ్ళింటికి వెళ్ళినా వాళ్ళుండరు. కారణం ఆదివారం నాడు కూడా స్పెషల్ క్లాసులు. ఎప్పుడైనా బస్సులో కానీ మరెక్కడైనా గాని కనపడినా గుర్తుపట్టలేరు. గుర్తుపట్టినా మనమెవరో వాడికి తెలియదు. ఒకవేళ ఎక్కడో చూసినట్టుంటే సొంత మేనత్త, మామయ్యగా కాక, 'మీరు ఫలానా యింట్లో ఉంటారే' అని చెబుతారు గానీ, బంధుత్వం తెలియదు."

ఈ లెక్కన చూస్తుంటే పిల్లలకు తల్లిదండ్రులు, తల్లిదండ్రులకు పిల్లలు తప్ప వేరే ఎవ్వరూ తెలియకుండా పోతుంది. చిన్ననాడే పిల్లలకు అన్ని విషయాలు చెప్పడంలో ఎటువంటి తప్పులేదు. లేకపోతే పెద్దయ్యే కొద్దీ చెప్పే తీరిక మనకుండదు,ఉద్యోగ ప్రయత్నంలోనో, లేక పై చదువుల వలనో వినే ఓపిక వారికుండదు.

"పిల్లలకు ఎక్కడెక్కడ ఏఏ ఆస్తులున్నాయో తెలియక పోయినా ఫర్వాలేదు గానీ ఏఏ ఊర్లో ఎవ్వరెవరు బంధువు లున్నారో తప్పక తెలియాలి. నేటి పిల్లలకు మన బంధు గణం, తాత ముత్తాతల పేర్లు, ఇంటిపేర్లు, గోత్రాలు చెప్పడంలో తప్పేమీ లేదు. లేకపోతే పెదనాన్న చిన్నాన్నల పిల్లలు కూడా ఇంటిపేర్లు ఒకటే గాని వాళ్ళకి వాళ్ళు ఏమౌతారో తెలియని పరిస్థితి ఎదురౌతుంది కమల".

"కాబట్టి ఏ ఆదివారమో, మరోరోజు వీలున్నప్పుడో పిల్లలను సినిమాలకు, పార్కులతో పాటు బంధువుల ఇంటికి కూడా తీసుకువెళ్తే బాగుంటుంది కమల" అని ముగించింది లలిత.

"ఔను అక్కా! నువ్వు చెప్పింది నిజమే! పూర్వపు రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు కాబట్టి అందరూ హాయిగా కలసి మెలిసి ఉండేవాళ్ళం. ఆరోజులు మళ్ళీ రావాలని అందరూ ఆకాంక్షిద్దాం" అంటూ ముగించింది కమల"!

– ఆగష్టు, 2008

❖ ❖ ❖

2. శ్రీశ్రీ అంతరంగం

(శ్రీశ్రీ శత జయత్యుంత్సవ సంవత్సరం)

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి............"

అంటూ ఓ కళాశాలలో విద్యార్థులంతా ముక్తకంఠంతో చదువుతున్నారు. వారందర్నీ దగ్గరుండి చదివిస్తున్నాడు ఆ కాలేజీ తెలుగు లెక్చరర్. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు పదాలను ముక్కలు చేసి, అర్థాలను మార్చేసి, పదాలను వదిలేసి, చదవడాన్ని వింటున్న స్వర్గంలోని "శ్రీశ్రీ"కి కాస్త వారిని దారిలో పెడదామనే తలంపు వచ్చింది. ఎలాగూ స్వర్గం చేరుకుని చాలారోజులైందని, ఒకసారి భూలోకం చూసి రావాలనిపించింది. దేవేంద్రుని అడగ్గానే, సరే వెళ్ళండని, అక్కడ మీ 'శతజయంతి ఉత్సవాలు' చేస్తున్నారని మాకు కూడా తెలిసిందని పంపించగానే తనదైన పాత ఆహార్యంలోనే భూలోకం బయలుదేరి తిన్నగా ఆ కాలేజికి వచ్చాడు.

నేరుగా ఆ గొంతులు వినపడుతున్న క్లాస్ రూం లోపలకు వెళ్ళబోతుంటే, ఆ లెక్చరర్, శ్రీశ్రీని చూసి, "ఆగవయ్యా, ఎవరయ్యా నువ్వు? అడగటం పుడకటం లేకుండా ఇలా క్లాస్ రూంలోకి వచ్చేస్తున్నావ్"? అంటుండగానే నేను శ్రీనివాసరావును, మా యింటిపేరు శ్రీరంగం. నన్నందరూ శ్రీశ్రీ అంటారు" అని చెప్పగానే, "ఆగాగు... ఏంటీ? నువ్వే శ్రీశ్రీ అంటే నేను నమ్మేస్తాననుకుంటున్నావా?

ముఖం వడలి పోయి, మొత్తమంతా ముడుతలు పడిపోయి, జోడు పెట్టుకుంటేనే గానీ కనపడని కళ్ళతోనూ, ఒకచేత్తో సిగరెట్ తోనూ, పైగా రాత్రి తాగిందింకా దిగినట్టుగా లేని నువ్వు శ్రీశ్రీ వంటే నమ్మేయడానికి నేనేమైనా సాదా సీదా వ్యక్తిననుకుంటున్నావా?" నేనీ కాలేజీ తెలుగు లెక్చరర్ని. నన్ను మోసం చేయాలనుకోకు" అని అంటున్న అతనితో మాట్లాడి ప్రయోజనం లేదనుకుని, వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకుంటుండగా, ఆ విద్యార్థుల్లోంచి ఒకడు, అతని దగ్గరికొచ్చి పదిరూపాయల నోటు ఇవ్వబోయాడు. 'నేనేమీ డబ్బుల కోసం వచ్చిన వాడ్ని కాదు.

నిజంగానే శ్రీశ్రీని నేనే' అని తను రాసిన గేయాల్ని పాడి వినిపించగానే, "చాలా బాగా పాడావు, నీకు మంచి ఫ్యూచరుంది, నాటకాల్లో గానీ సినిమాల్లో గానీ వెళ్ళి ట్రైచెయ్యి" అని వేళాకోలంగా అన్నాడు పక్కనే ఉన్న లెక్చరర్.

'నువ్వు కాస్తాగు...' అని శ్రీశ్రీ తన దగ్గరకు వచ్చిన విద్యార్థితో మాట్లాడుతూ... "మీరందరూ ఏం చదువుతున్నారో మీకు తెలుసా?" అని అడిగారు. 'నాకెందుకు తెలియదు, ఇది "మహాప్రస్థానం". దీన్ని రాసింది శ్రీశ్రీ గారనే మహాకవి' అని చెప్పాడా విద్యార్థి. ఆ మాటలకు చాలా సంతోషించిన శ్రీశ్రీ, "మరి అన్నీ తెలిసి, అందులో భావాల్ని చెడగొట్టి చదువుతున్నారెందుకు బాబు" అని అడిగారు.

"అతని భావాలు మాకెందుకండి? ఏదో సిలబస్‌లో పెట్టారు కనుక చదువుతున్నాం గానీ, అతని భావాల్ని పట్టించుకునే టైం మాకస్సలు లేదు. మా మాస్టరుగారు చెప్పిన భావం ఒక్కటే – అదే 'మార్క్సిజం', అని ఆ విద్యార్థి చెప్పగానే, "మరింకేం బాబూ! నీకు "మార్క్సిజం" గురించి తెలిసినప్పుడు, శ్రీశ్రీ గురించి మిగిలిన కవుల గురించి తెలియదని చెబుతావేం?" అని శ్రీశ్రీ అడిగారు.

"మీరు పొరబడుతున్నారు పెద్దాయన! "మార్క్సిజం" అంటే మీరు ఏమనుకుంటున్నారో నాకు తెలియదు గానీ మేమనుకునేది మాత్రం, ఇవాళ ఈ పద్యాలను బాగా బట్టీ పట్టేస్తే, రేపు వచ్చే పరీక్షలలో బాగా రాయవచ్చని, అలా రాస్తే మాకు "మార్కులు" పడతాయనే యిజాన్నే మేమంతా కూడా ముద్దుగా "మార్క్సిజం" అని పిలుచుకుంటాం" అని ఆ విద్యార్థి చెప్పగానే శ్రీశ్రీ గారికి నోట మాట రాలేదు. "అయితే మీరంతా కూడా కేవలం మార్కుల గురించే చదువుతున్నారు గానీ, తెలుగు సాహిత్యపు విలువలు ఏమౌతున్నాయో మీకు వద్దనుకుంటున్నారన్నమాట. మీరనుకున్నట్టు అది 'పద్యం' కాదు నాయనా... అది గేయం" అని చెప్పబోతున్న శ్రీశ్రీని దమాయించి, నీకు తెలియకపోతే తెలియనట్లుండు. డిగ్రీ చదువుతున్న నాకు, నువ్వొచ్చి ఏది పద్యమో, ఏది గద్యమో చెపుతావా? నువ్వూ, నీ వాలకం చూస్తే అసలు నీ పేరైనా నీకు తెలుగులో రాసుకోవడం వచ్చా?" అని తిరిగి శ్రీశ్రీ గారికే క్లాసు తీసుకున్నాడా విద్యార్థి.

పోనీలే బాబు, నా సంగతి పక్కన పెడితే, కనీసం మీ సిలబస్‌లో పెట్టినందుకైనా ఆ గేయాల మీద శ్రద్ధ పెట్టి చదువచ్చు కదా బాబు! అన్న శ్రీశ్రీ గారితో నీకు లోకం తీరు అస్సలు తెలియనట్లుందే ? సిలబస్‌లో పెట్టారు గనుక అన్నింటినీ చదువుకుంటూ కూర్చుంటే, ఒట్టి తెలుగు మాత్రమే పాసవుతాం. మిగిలిన సబ్జెక్ట్సు పోతాయి. అయినా ఈ రోజుల్లో ఇంకా "తెలుగు"ను చదువుకుంటే ఉద్యోగాలు ఏం ఉంటాయి?" అదే ఏ

కంప్యూటర్స్‌లోనో సాఫ్ట్‌వేరో, హార్డ్‌వేరో చదివితే చేతినిండా డబ్బే డబ్బు. చక్కగా డిగ్రీ అవగానే విదేశాలు వెళ్ళిపోవచ్చు" అని మాట్లాడుతున్న ఆ యువకునితో, ఇక్కడ చదువుకొని విదేశాలు వెళ్ళిపోతే మరి నిన్ను కన్న తల్లిదండ్రుల సంగతి? నీ దేశం గురించి ఎవరు ఆలోచిస్తారు బాబూ?" అని శ్రీశ్రీ అడిగారు.

ఊరుకోండి సార్! మీరు మరీను! మీరు ఇంకా పాత కాలంలోనే ఉండి పోయినట్టున్నారు. ఇప్పుడు మీరనుకుంటునట్లుగా ఆప్యాయతలు, అనుబంధాలు లేవండి. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నామని చెబుతూ, మమ్మల్ని L.K.G. నుండి హాస్టల్‌లో పెట్టి, నెలకు వేలకు వేలు ఖర్చుబెడుతున్నాం కదా, చదువుకోడానికి మీకేంటి ప్రాబ్లమని అంటున్నారు. అందుకనే మేము కూడా చదువు పూర్తవ్వగానే, విదేశాలు వెళ్ళి సంపాదించి వాళ్ళ 'బాకీ' తీర్చేస్తే సరిపోతుంది. ఎందుకంటే, చిన్నప్పటి నుండీ మా ఆలన-పాలనా చూసే తీరుబాటు వాళ్ళకుండట్లేదు. జీవితం అంటే పూర్తిగా చదువుకోవడం అనే భ్రమలో మాత్రమే ఉంటున్నారు. మాకూ అందరితోనూ ఆడుకోవాలని, అమ్మా నాన్నలతో సినిమాకో, షికారుకో వెళ్ళాలని ఉంటుంది. కానీ హాస్టల్లో అవేమి కుదరవే.

పొద్దున్నే 6 గంటలకు లేచిందగ్గర్నుండి ఒకటే చదవటం, రాత్రి 10 గంటల వరకు అదే పని. ఇక మీరన్నట్లుగా సాహిత్యపు విలువల గురించి మాకెందుకండి? ఏదోలా డిగ్రీ చేతికొస్తే చాలు. ఈ తెలుగు మాకెందుకు? ఎక్కడా కూడా పనికి రాదు. పరీక్షకు ఒక రోజు ముందు పుస్తకం తీసి చదివి, ముక్కు మీద పెట్టి రాసి వచ్చేయడమే చాలా ఈజీ తెలుసా! అంతే గానీ ఈ సాహిత్య చరిత్రను గుర్తుపెట్టుకోవడం ఎవరి వల్ల ఔతుందండి? ఎవరెవరో తమకొచ్చిన పద్యాలను, గేయాలను రాసి పారేసారు. వాటిని ఏరుకొచ్చి, సిలబస్సంటూ మాకు తగిలించారు. వాటిని పూర్తిగా చదివితే, మేముకూడా మళ్ళీ ఏదోటి రాసేసామనుకోండి, వాటినికూడా ఎవరైనా, మా తర్వాతి తరానికి సిలబస్‌గా పెట్టేస్తే,ఇప్పుడు మేము తిట్టుకుంటున్నట్లే, అప్పుడు వాళ్ళు కూడా మమ్మల్ని తిట్టుకోవడం మాకస్సలు ఇష్టంలేదు, అందుకే ఆ 'సాహిత్యం' గట్రా మేము చదవటంలేదు" అని చెప్పాడా విద్యార్థి.

పెద్దలంటే కనీస గౌరవం లేని వాళ్ళ దగ్గర ఉండడం కంపరమనిపించి, చేతిలో సిగరెట్ అయిపోవడంతోనూ రుసరుసమంటూ బయటకు వచ్చేశారు శ్రీశ్రీ. కొంచెం ముందుకు నడవగానే ఓ పాఠశాలలో "శ్రీశ్రీ గారి కవితకి పేరడీ" అనే మాటలు వినిపించి, అటువైపు వెళ్ళారు. "పిల్లలూ ఈ పాఠం 'జరుక్ శాస్త్రి' గారు రాసారు. దీని పేరు 'సరదా పాట'. ఇది పేరడీ అన్నమాట" అంటూ నేరుగా పాఠం చెప్పుకు వెళ్ళిపోతున్న ఆ మాస్టర్ దగ్గరకు వెళ్ళి, మీరు పేరడీ అని చెబుతున్నారు

కదండి, మరి ఆ పాటకు మూలం ఏమిటో, దాన్నిఎవరు రాసారో పిల్లలకు చెప్పాలి కదండి." అన్నారు శ్రీశ్రీ. "మీరెవరో నాకు తెలియదు కానీ, మీరన్నట్టుగా దీనికి మూలం ఏంటో చెప్పి, అప్పుడు ఈ పాఠం చెప్ప మని మాకెక్కడా, ఎవరూ చెప్పలేదు. పోనీ మేమే చొరవ తీసుకుని చెబుతామన్నా, వీళ్ళింకా చిన్న పిల్లలు కనుక వీళ్ళకు అదేమీ అర్థం కాదు. ఎందుకంటే శ్రీశ్రీ గారి విప్లవ సాహిత్యమది. ఇంత చిన్న పిల్లలకు విప్లవ సాహిత్యమెలా చెప్పాలో మీరే చెప్పండి.

అదీ కాక, ఈ పాఠం అర్థమయ్యేటట్లు చెప్పడానికే మా తల ప్రాణం తోకకొస్తోంది. అలాంటిది ఇక "సిందూరం రక్త చందనం" అని చెప్పామో ఇక మాపని అంతే, అందుకే నేరుగా పాఠం చెప్పేస్తున్నాం, వాళ్ళు వినేస్తున్నారు. అయ్యా మాస్టారూ! శ్రీశ్రీ అంతా విప్లవ సాహిత్యమే రాయలేదండి. అని ఇంకేదో చెప్పబోతుంటే, ఆగండి సార్! ఈ పాఠం చెప్పడానికే దీని నేపథ్యం, సందర్భం అన్నీ చెప్పాలి. అలా కాకుండా దీని మూలం కూడా చెప్పడం నావల్ల కాదు. ఇక మీకేవైనా సందేహాలుంటే, నన్ను కాకుండా పేరడీ రాసిన జరుక్ శాస్త్రిని వెళ్ళి అడగండి" అని విసుక్కున్నాడు.

అయ్యో! తెలుగు పరిస్థితి ఇలా దిగజారిపోతోందే అని బాధపడుతూ ఇంకొంచెం నడవగానే , వేరే తరగతి గదిలో లీలగా ఏదో పాఠం వినిపిస్తుంటే , ఏదో తెలిసినదే అని అటుపక్క వెళ్ళారు శ్రీశ్రీ. "మెరుపు మెరిస్తే, వాన కురిస్తే అది మీకోసమే అని ఆనందించే బుడతల్లారా, పాపల్లారా" అంటూ 'శైశవ గీతిని' చదువుతున్న పిల్లల్ని చూసి ఆనందపడినా వాళ్ళు చదివే తీరుచూసి కొంత బాధపడ్డారాయన. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పిల్లలకోసమని నేను రాసిన ఈ "గీతి" ని వీళ్ళు చాలా నీరసంగా "మాకెందుకురా భగవంతుడా! అన్నట్టుగా ఏదో పాడిపాడిగా చదవటం చాలా బాధగా ఉంది" అనుకొని ఇక ఈ విధానమే ఇంత కాబోలు అనుకొని బయటికి వచ్చేశారు. పిల్లలు తప్పులు చదువుతున్నారు, ఏదో వారిని దార్లో పెడదామనే ఆతృతలో వాళ్ళు చదువుతున్న కాలేజీకి వచ్చేశారే గానీ, ఆ తలంపులన్నీ వీగిపోయాక, తను ఎక్కడున్నది అప్పుడు చూసుకున్నారు శ్రీశ్రీ. "ఇదేదో నాకు బాగా అలవాటున్న, తెలిసిన ఊరులాగానే ఉంది కానీ ఏ ఊరో సరిగ్గా గుర్తుపట్టలేకపోతున్నానే" అనుకొని అక్కడ ఓ బడ్డీ కొట్టువాడ్ని 'ఇది ఏ ఊరని అడగ్గానే "విశాఖపట్నం" అని చెప్పాడు.

"నేను తిరిగిన విశాఖపట్నమేనా ఇది?"ఎంత మారిపోయింది! ఎక్కడా ఆనవాలు దొరక్కుండా అయిపోయింది. అనుకొని కొంచెం ముందుకు నడిచారు. అక్కడొక తరగతి గది ముందు మెడలో చిన్న పలక వేలాడేసుకొని, ఏడుస్తూ నిల్చొని ఉందొక చిన్న పాప. ఆ పాప దగ్గరకు వెళ్ళి, "ఏం బంగారూ! బడికి ఆలస్యమయ్యావని బయటే నిలబెట్టేశారా?" అని అడిగారు శ్రీశ్రీ. నో అంకుల్, క్లాస్ లో "తెలుగులో

మాట్లాడానని టీచర్ పనిష్మెంట్ ఇచ్చారు" అంటూ ముద్దు ముద్దుగా చెప్పిందా పాప. కళ్ళు తిరిగినట్లైంది మన శ్రీశ్రీ గారికి. ఏంటమ్మా నువ్వు చెప్పింది? క్లాస్ లో తెలుగులో మాట్లాడినందుకు ఇలా పనిష్మెంట్ ఇచ్చారా? ఏంటో మన లోకం తీరు అనుకొని, కొంచెం ముందుకు నడిచారు.

అక్కడ పెళ్ళి జరుగుతోంది. బాగా కోలాహలంగా ఉంది. పెద్దపెద్ద స్పీకర్ల నుండి చాలా పాటలు వినిపిస్తున్నాయి. చక్కగా పెళ్ళి పందింట్లో తెలుగు పాటలు వేయకుండా ఈ ఇంగ్లీషు గోల ఏమిటని,అక్కడొక వ్యక్తిని అడగ్గానే, ఇవి తెలుగు పాటలేనని సమాధానమిచ్చాడా వ్యక్తి. ఇవేం తెలుగు పాటలు? అర్థం పర్థం లేకుండా ఉన్నాయంటున్న శ్రీశ్రీ ని అదోలా చూసిన అతను, ఏలోకం నుండి వచ్చావయ్యా నువ్వు? అంత బీట్ ఉన్న సాంగ్స్ విని ఎంజాయ్ చేయటం మానేసి అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నావ్?"అని అన్నాడు. "బాబు! నేను కూడా సినిమాపాటలురాసిన వాడ్నే. మరీ అంతలా తీసి పారేయకు. నేను రాసిన "అల్లూరి సీతారామరాజు" సినిమాలోని 'తెలుగువీరలేవరా' పాటకు జాతీయ అవార్డు కూడా వచ్చింది తెలుసా?" అని ఆ యువకునితో అనగానే, ఎవరికి కావాలయ్యా అలాంటి పాటలు? అయినా అల్లూరి సీతారామరాజూ... గాంధీ... అంటూ కూర్చుంటే ఇక్కడ దినంగడవదుగానీ వేరే ఏమైనా ఉంటే చూస్కో" అంటూ ఆ యువకుడన్న మాటలకు కోపమొచ్చింది శ్రీశ్రీ గారికి. తనెవరో సూచనప్రాయంగా చెప్పినా గుర్తించలేని వాడితో మాట్లాడి ఉపయోగం లేదని ఇంకొంచెం ముందుకు నడిచారు.

అక్కడ ఒక సాహిత్య సభ జరుగుతోందని తెలిసి, "పోనీలే ఇంకా సాహిత్య సభలైనా నిర్వహిస్తున్నారు" అని అందులోకి వెళ్ళారు శ్రీశ్రీ. ఈ సాహిత్య సభలోనైనా "యువత" కనిపిస్తారేమోనని ఆశించి. అందులోకి వెళ్ళిన అతని ఆశలు ఫలించలేదు. ఏదో పుస్తకావిష్కరణ సభ జరుగుతోంది. అందులో అంతా కూడా పూర్తిగా జుత్తు నెరిసిన వాళ్ళు 60 సంవత్సరాలు పైబడ్డ వాళ్ళే తప్పించి, ఎక్కడా యువకుల ఊసేలేదు. ఆ సభలో ప్రధానవక్తలందరూ కూడా, తెలుగు భాష చచ్చిపోతోందని, దానికి పూర్వవైభవం తిరిగి రావాలని, పూర్వకవులసాహిత్యం అందరూ చదవాలని చాలా రకాలుగా మైకులు ముందు చెబుతున్నారు. సభ అంతా అయిపోయాక అందరూ బయలుదేరుతున్నప్పుడు అందులో ఒక్కల్ని శ్రీశ్రీ ఇలా అడిగారు. చాలా బాగా చెప్పారు, ఇంతకీ మీ పిల్లల్ని ఈ సభకు తీసుకువచ్చారా? అని అడగ్గానే, అతను నీళ్ళు నములుతూ, ఇది పరీక్షల సమయంకదండీ, అందుకే తీసుకురాలేదని చెప్పి తొందరగా వెళ్ళిపోయాడు.

మరోచోట 'అష్టావధాన సభ' జరుగుతోంది. అవధానంచూసి చాలా రోజులైందని ఆ సభకి వెళ్ళారు శ్రీశ్రీ. ఓ సినిమా హాలు పక్కనే ఈ సభ జరుగుతోంది.

అవధాని, పృచ్ఛకులు, ప్రేక్షకులు అందరూ కూడా పెద్ద వాళ్ళే. ఎక్కడా యువకుల ఊసేలేదు. ఆ సభా నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ అవధానంలో పృచ్ఛకులను చాలా దూరం నుండి తీసుకువచ్చాం ఎందుకంటే అవధానులే చాలా తక్కువమంది ఉన్నారనుకుంటే, పృచ్ఛకులు కూడా తగ్గిపోతున్నారు. తెలుగు తెలిస్తే సరిపోతుంది కదా అనుకుంటే ఆ ప్రక్రియలు తెలిసిన వాళ్ళు దొరకడం కష్టమయిపోతోంది. అందుకే దీన్ని కాపాడుకోవడం మన మీదనే ఆధారపడి ఉంది" అని ప్రసంగించి, అవధానాన్ని ప్రారంభించారు.

అందులో కూడా ఇంగ్లీషు పదాలు వచ్చినా బాగానే ఉన్నాదనుకుని. సిగరెట్ కాల్చాలని బయటికి వచ్చేశారు. ఈలోగా పక్కనే ఉన్న సినిమా థియేటర్‌లో సినిమా అయిపోయినట్లుంది. అప్పుడే బయటకి వస్తున్న వారిని చూశారు శ్రీశ్రీ. అక్కడ అవధాన సభలో ముందు సీట్లు మాత్రమే జనం ఉండి, వెనుక కుర్చీలన్నీ ఖాళీగానే ఉన్నాయి. కానీ పక్కనే ఉన్న సినిమాథియేటర్‌లో "హౌలు నిండినది" అనే బోర్డు కనిపించింది. హౌలులోంచి వస్తున్న వారందరూ యువకులే.అందరూ ఎవరి బళ్ళమీదవారు శ్రీశ్రీగారిముందు నుండే వెళ్ళిపోతున్నారు. "యువత తీరిలా ఉందేంటి?" అని ఆలోచనల్లో పడ్డారు శ్రీశ్రీ. పక్కనే చక్కటి "తెలుగు" పద్యాలు చెబుతున్నారు, అదికూడా ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా. బాగా ఆస్వాదించడం మానేసి వందల వందలు ఖర్చు పెట్టి ఆంగ్ల సినిమాను చూడడమేంటోనని సిగరెట్ అయిపోగానే మళ్ళీ అవధానానికి వెళ్ళి కూర్చున్నారు. అక్కడ సమస్య ఇది:

"శ్రీశ్రీకిన్ విశ్వనాథ శిష్యుండాయెన్"

అనే సమస్య విని, అవధాని ఎలా పూరిస్తారోనని కుతూహలంగా చూస్తున్నారు శ్రీశ్రీ. **"ఆశ్రిత జన వత్సలుడై"** మొదటి పాదం బాగుందని సంచాలకుడు పొగిడి, నెక్స్ట్ దత్తపది అంశం అని ప్రకటించగానే ఆ పృచ్ఛకుడిచ్చిన దత్తపది అంశం ఇది:

డ్రాయరు, బనియను, లుంగీ, లంగా - ఈ పదాలతో రామాయణంలో సీతాస్వయంవరాన్ని వర్ణించమని అడగ్గానే, అదివిన్న శ్రీశ్రీ గారు చెవులు మూసుకొని అవధానం అంటే చక్కని తెలుగు పద్యాలు చెబుతారనుకున్నాను, కానీ ఇక్కడ ఈ పదాలేంటని, విసుగెత్తిపోయి విసురుగా బయటికి వచ్చేశారు. సీతా స్వయంవర ఘట్టాన్ని "వాగ్దానం" సినిమాలో ఎంతో మధురంగా హరికథ రూపంలో రాసాను కదా! అని ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నారు. అలా బయటకి వచ్చీ రాగానే అక్కడే కొంచెం దూరంలో ఒక బేనర్ కనిపించింది. అదేమిటోనని దగ్గరకు వెళ్ళి చూశారు. "శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాలు" అని.

చాలా పెద్ద అక్షరాలతో కట్టిన బ్యానరది. దాని మీద తేదీ ఆరోజేనని గుర్తించి, టైం అయిపోతోందని, ఆ వేదికను తొందరగా చేరుకున్నారు. అరగంట ఆలస్యమై పోయింది, ఎంత సభ అయిపోయిందో ఏమిటో నని ఆయాసపడుతూ లోపలకు వెళ్ళిన అతనికి అక్కడ కొంతమంది విద్యార్థులు కనిపించారు. ముందు వరుసలో అతిరథమహారథులు కూర్చున్నాగానీ శ్రీశ్రీ దృష్టి మాత్రం ఆ విద్యార్థుల మీదనే ఉంది. ఈ నిర్వాహకులెవరో కానీ నా మనసును గుర్తించిన వారిలా ఉన్నారు. ఎంతో కొంతమంది విద్యార్థులనైనా తీసుకురాగలిగారని సంతోషిస్తున్నాను. ఇంతలో "ఇప్పుడు జ్యోతిప్రజ్వలనతో సభ ప్రారంభమౌతుందని చెప్పగానే, అందరూ లేచినిలబడ్డారు. ఆ కార్యక్రమం జరిగాక, మొదటి వక్త మైకు దగ్గరకు రాగానే, లేచి నించుని ఉన్న విద్యార్థుల్లో ఒక్కొక్కరూ కూడా బయటికి వెళ్ళిపోవడం శ్రీశ్రీ గారు గమనించారు. వెంటనే బయటకు వెళ్ళి, వారిని వారించే ప్రయత్నం చేస్తుంటే, నువ్వొరుకోవయ్యా, నీకేమీ తెలియదు, పొద్దున్నుంచీ క్లాసులో పాఠాలు వినీవినీ ఉన్న మమ్మల్ని బలవంతంగా ఇక్కడకు తీసుకొచ్చి తలుపులు వేసేసిమరీ కూర్చోబెట్టారు. ఇప్పుడుకూడా ఇంటికి వెళ్ళకపోతే ఇక అంతే! అందరూ పట్టుకు వాయించేస్తారు ఒక్కొక్కరు లేచి బయటకు వెళ్ళిపోతుంటే ఆ సభలో మళ్ళీ మామూలే అన్న చందంగా పెద్దవాళ్ళే మిగిలారు.

ఈ చర్యకు బాధపడిన శ్రీశ్రీ మనయువత ఎందుకిలా ఔతోంది, ప్రతి రంగంలోనూ యువత ముందుండాలి అని ప్రోత్సహించి ముందుకు నడుపుతున్న తలిదండ్రులు, పెద్దలు మాత్రం తెలుగు సాహిత్యం చదవడంలో తెలుగుపరిరక్షణలో యువతను ఎందుకు ప్రోత్సహించడంలేదు? అందరూ అనుకున్నట్లుగా తెలుగును మాత్రమే చదవమనట్లేదుగా? తెలుగునుకూడా చదవమని అంటున్నాను. పరాయివాళు ళ్ళ సైతం నేర్చుకుంటున్న మన భాషను మనపిల్లలే ఎందుకు అడ్డనుకుంటున్నారు? మన కవుల పేర్లు, వాళ్ళు రాసిన కృతుల పేర్లు తెలుసుకోవాలనే జిజ్ఞాసను చిన్నప్పటినుండే వారిలో కలిగించాలంటే ఏం చెయ్యాల్లో ఆలోచించాల్సిన అవసరం ఇప్పుడిప్పుడే మనకు కలుగుతోంది.

వేయిసంవత్సరాల తెలుగు సాహిత్యచరిత్ర మీద కుతూహలం కలిగించి చదివించాలే గానీ, భయపెట్టి చదివించడం అజ్ఞానమే అవుతుంది. ఏదో సిలబస్‌లో పెట్టారు కనుక పొడి పొడిగా దాని గురించి చదివితే ఏమీ తెలియదు. దాని ముందు వెనుకలుకూడా చదివితేనే ఆ విషయం మీద బాగా "పట్టు" ను సాదించేటట్టు చేయగలం. తెలుగు మరణిస్తోంది, మృత భాష అయిపోతోంది,దీన్ని ఎలాగైనా కాపాడుకోవాలని 60 సంవత్సరాలు పైబడిన వాళ్ళు మాత్రమే అనుకుంటే చాలదే! ఇప్పుడున్న జనాభాలో అధికభాగం 'యువత'దే కాబట్టి యువతకు తెలుగుభాషలోగల సౌందర్యాన్ని, ఆనందాన్ని రుచిచూపిస్తే వారికి వారుగా భాషా పరిరక్షణలో పాలు పంచుకుంటారు.

"తెలుగు" మీద అభిమానం పెంపొందించే కార్యక్రమాలను చేయాలి. పిల్లలను సినిమాలకు, పార్కులకు తీసుకువెళ్ళే తల్లిదండ్రులు, వారంలో ఒక్కరోజైనా ఏదో ఒక సాహిత్య సభకు తీసుకు వెళ్తే ,వాళ్ళకి భాష మీద కుతూహలం పెరుగుతుంది. రెండు మూడు సభలు అర్ధం కాకపోయినా, నాలుగో సభనుండైనా వారికి అంతో ఇంతో ఎంతో కొంత తెలిసొస్తుంది" అని తనలో తాను అనుకున్న శ్రీశ్రీ గారు ఆ సభా మండపాన్ని దాటి కొంచెం ముందుకు నడిచాక అక్కడ ఒక గ్రంథాలయం కనిపించి అందులోకి వెళ్ళారు.

చాలా పుస్తకాలున్నాయా గ్రంథాలయంలో. తిన్నగా ఆ లైబ్రేరియన్ దగ్గరకు వెళ్ళి, 'బాబు...! శ్రీశ్రీ సాహిత్యం...' అంటూ నోటిలోమాట నోటిలో ఉండగానే, ఆ లైబ్రేరియన్ లేచి నించుని, అదిగో బాబు.. ఆ బిరువా నిండా ఆ పుస్తకాలే. వాటి జోలికే ఎవరూ వెళ్ళడంలేదు. ఇప్పుడు అందరూ కూడా సాహిత్యం పక్కనపెట్టి వేరే ఏవో చదువుకుంటున్నారు" అని సమాధానమిచ్చాడు. 'అయ్యో! సమాజానికి ఉపయోగపడుతుంది, అందులోనూ 'యువత' నా సాహిత్యం చదవాలనే ఆశయంతో నా ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా రాసిన ఈ పుస్తకాలు ఇలా ఈ నాలుగు గోడల మధ్యన గాలి తగలని బీరువాల్లోనో, లేక ఒకరిద్దరు చదవడానికో ఉండిపోయాయంటే, ఎలా జీర్ణం చేసుకోవాలో తెలియడంలేదే'' అని బాధపడుతుండగా,ఒక యువకుడు వాళ్ళ దగ్గరకు వచ్చి ,సార్, మన దగ్గర శ్రీశ్రీ సాహిత్యం ఉందా అని అడగ్గానే, శ్రీశ్రీ గారి ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

పదబాబు అదిగో అక్కడ బీరువాలో ఉంది. నేను ఎదురుచూస్తుంది కూడా నీలాంటి యువకులు నా సాహిత్యం చదవాలనే అంటూ ఆనందంతో ఉబ్బి తబ్బిబౌతున్న శ్రీశ్రీ గారిని కిందనుండి పైవరకు చూసిన ఆ యువకుడు, ఆగండి సార్ మా బావ చెప్పగానే "సివిల్స్"కు తెలుగు ఆప్షనల్ తీసుకున్నందుకు, ఆ శ్రీశ్రీ సాహిత్యం చదవాల్సి వచ్చింది గానీ, లేకపోతే నాకెందుకా పుస్తకాలు" అని ఆ యువకుడు అనగానే శ్రీశ్రీ గారు అప్పుడనుకున్నారు, ఎప్పుడో 1934 లో మహాప్రస్థానం రాసానుగానీ నిజానికి ఇప్పుడు యువకుల్లో చైతన్యం కలిగించాలంటే నేను మళ్ళీ పుట్టి, మళ్ళీ రచనలు చేయాల్సిన అవసరముంది. కనుక ఇప్పుడే మళ్ళీ జన్మ గురించి దేవేంద్రునితో మాట్లాడివస్తానని మాయమైపోయారు శ్రీశ్రీ. చూస్తుండగానే ఆయన మాయమైపోవడం ఆశ్చర్య మనిపించింది వారికి. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యతను తన భూజాల మీద వేసుకునే పనిలో ఉన్నారు శ్రీశ్రీ. ఏదోక రోజున తిరిగి భూమ్మీద జన్మిస్తారని నమ్ముదాం. అతని సాహిత్యాన్ని బీరువాలలో రక్షించడంకాకుండా, వాటిని తీసి పిల్లల చేత చదివించడమే శ్రీశ్రీకి మనమిచ్చే అసలైన నివాళి.

మన తెలుగు భాష చక్కని 'మామిడి చెట్టు' అనుకుంటే మన పూర్వులందరూ దాని 'వేర్లు'. ఇక దానికి కాండం మన 'సమాజం'. ఆ మామిడి చెట్టుకున్న కొమ్మలు అన్నీ "మాండలికాలు". అనుకుంటే, ఇక ఆ చెట్టు పైన వాలే పక్షులు తెలుగు భాషలోకి వచ్చి చేరుతున్న 'అన్య భాషాపదాలు'. ఆ పక్షులు ఎగిరిపోయినట్టుగా కొన్ని పదాలు పోతుంటాయి, అలాగే కొత్త పక్షులు వచ్చి వాలినట్లుగా, కొత్త కొత్త పదాలు వచ్చి చేరుతుంటాయి. ఏ పక్షులకైనా ఆశ్రయమిచ్చే చెట్టు లాంటిది మన భాష. ఇక ఆ చెట్టుకుండే ఆకులే తెలుగు ప్రజలు.

ఆ చెట్టుకు అప్పుడే పుడుతున్న పువ్వు, బాల కవులనుకుంటే ఆ పువ్వునుండి వచ్చే పిందెలు, కాయలు, పళ్ళు. ఆ కవులు చెప్పే కవిత్వం లాంటిది. పిందెలు కసగా జీడోడుతూ ఉన్నట్టుగా ఆ వయసులో కవిత్వం కూడా కసగానే అనిపిస్తుంది. ఇక తర్వాతిదైన కాయలు పుల్లగా ఉన్నట్టుగా, కొంచెం నడి వయస్సుకు రాగానే వారి కవిత్వంకూడా తియ్యతియ్యగా పుల్లపుల్లగాఉన్నట్టు అనిపిస్తుంది. కాయలుగా ఉన్నప్పటి కన్నా, పళ్ళయ్యేవరకు ఆగి, పళ్ళఅయ్యాక అప్పటి రుచిని ఆస్వాదిస్తే చాలా మధురంగా ఉంటుంది. పూర్తిగా పక్వానికి వచ్చిన పండులాగా కవుల కావ్యాలు కవితలు ఆహ్లాదంగా ఉంటాయి.

అయితే తెలిసో తెలియకో మనం ఇప్పుడు చేస్తున్న చర్యల వలన, కాపులేకుండా పోతోందా చెట్టు. ఇంకా చెప్పాలంటే "చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకుంటున్నాం". ఏ చెట్టుకైనా పువ్వు పూసిందగ్గర్నుండీ రక్షణ కల్పించి, దానికి తగిన నీటిని పోస్తే, దానికి కావల్సిన వాటిని భూమి నుండే గ్రహిస్తుందా చెట్టు, సంవత్సరంలో ఒక్కసారే కాపు కాస్తుందని చెట్టుకు నీరు పోయడం మానేసినా, లేక, ఈ చెట్టే దండగని కాండం నరికేసినా, మళ్ళీ చిగురించడానికి కొంతసమయం పడుతుంది. అలా కాదని కసు-గాయలని కోసేస్తే చక్కనిపండ్లను ఆస్వాదించలేం. ఇక్కడ నా ఉద్దేశం కసుగాయలంటే యువత చెప్పే కవిత్వం అనుకుంటే దానికి ప్రోత్సాహమందిస్తే పరిపక్వానికి వస్తుందని.

– ఏప్రిల్, 2010.

❖ ❖ ❖

3. మేలుకొలుపు

బావా, బావా లే బావా! మేలుకో బావా! అంటూ భర్తను నిద్ర లేపుతోంది ప్రియంవద. “అబ్బా ఏంటి ప్రియం, ఆదివారంకూడా హాయిగా నిద్రపోనియ్యకుండా ఈ హడావుడి దేనికి?” అంటూ విసుక్కున్నాడు అనురూప్. అనురూప్, ప్రియంవదలు మేనత్త మేనమామ పిల్లలు. వరసైన వారవడం, పైగా ముందుగానే అనుకున్న సంబంధం కాబట్టి వారిద్దరికీ పెళ్ళి చేశారు పెద్దలు. ఆదివారమైనా, ఇవాళ, మాచెల్లి రోహిణికి, మీతమ్ముడు రోహిత్‌ల పెళ్ళి మాటలకు మాట్లాడానికి మావయ్య, అత్తయ్య, మా అమ్మ నాన్నలు వస్తున్నారు. ఇంటికి పెద్దవారైన మీరే ఆలస్యంగా తయారైతే ఎలా చెప్పండి. ఇది మన ఇంట్లో జరగబోయే ఆరో మేనరికం. రోహిణి, రోహిత్‌లు ఇద్దరూ కూడా మెడిసిన్ చదువుతున్నారు. పైగా వరసైనవారు. కాబట్టి వాళ్ళిద్దరికీ కూడా పెళ్ళి చేసేస్తే బాగుంటుంది. అందులోనూ మేనకోడలిని కోడలిగా చేసుకుంటే రానున్న రోజులలో ఎటువంటి కష్టాలు పడక్కర్లేదని మీ అమ్మానాన్నలు అనుకోవడం చాలాసార్లు విన్నాను.

ఇలా మాట్లాడుతుండగానే అనురూప్ తల్లిదండ్రులైన నరసింహం, పార్వతమ్మలు వచ్చారు. రా! అత్తయ్య, రండి మావయ్య అంటూ లోపలికి ఆహ్వానించింది ప్రియంవద. ఈలోగా ప్రియంవద అమ్మానాన్నలైన పరాంకుశం, రత్నమ్మలు కూడా వచ్చారు. వాళ్ళనికూడా లోపలికి ఆహ్వానించాక, కుశల ప్రశ్నలు ముగిసేలోపలే రోహిణీ రోహిత్ లు కూడా వచ్చారు. అయితే వాళ్ళకి పెళ్ళి గురించి తెలియదు. ఇక్కడికి వచ్చాకే తెలిసింది.

“అదేంటి నాన్నా! రోహిణితో పెళ్ళని నాకు ముందుగానే ఎందుకు చెప్పలేదు?” అంటూ నరసింహాన్ని అడిగాడు రోహిత్. “ఇందులో అనుకోవడానికి ఏముందిరా! మీ అన్నావదినలు కూడా ముందునుండి అనుకుంటున్నదే కదా! అలాగే మీరు పుట్టగానే మేము ఒక మాట అనేసుకున్నాం” అని పార్వతమ్మ అంది. ‘అది కాదమ్మా! మనింట్లో ఇప్పటికే మేనరికాలు బాగా ఎక్కువయ్యాయి. అసలు మేనరికాలే పనికి రావని మెడికల్ సైన్స్ చెప్తుంటే, మీరేమో మేనరికాలమీద మేనరికాలు చేసేస్తుంటే ఎలా?” అంటూ

వివరించబోయిన రోహిత్‌ను అడ్డుకుంటూ, "చూడు రోహిత్ ! మెడికల్ సైన్స్ ను కాసేపు పక్కన పెట్టి, మా ఆలోచనలను కూడా కొంచెం పట్టించుకోండి. ఎవరో ముక్కూ, మొహం తెలియని అమ్మాయిని పదినిమిషాల పెళ్ళి చూపుల్లో చూసి, అమ్మాయి నచ్చితే పెళ్ళి చేసిన దగ్గర్నుండీ ఆ వచ్చిన కోడలు అత్తమామలను చూడకుండా,ఆస్తిలో మాత్రం వాటా అడిగి, అత్తమామలను వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేసి, ఏ ఆదివారమో లేకపోతే పండగకో మొక్కుబడిగా చూడడానికి వచ్చివెళ్ళిపోతుంటే, పుట్టిన దగ్గర్నుండీ కళ్ళలో పెట్టి చూసుకున్న కొడుకును, మధ్యలో వచ్చిన కోడలు గ్రద్దలా తన్నుకుపోతే మా పరిస్థితి ఏమిటి చెప్పు!" అని నరసింహం అన్నాడు. అదే ఇంట్లో పిల్లయితే ,ఎంచక్కా మాకల్లముందే పెరిగింది కనుక మా మనస్తత్వం తెలుసును కనుక మాకు ఏటువంటి ఇబ్బంది వుండదని అనుకుంటున్నాం" అని పార్వతమ్మ అంది.

"అసలు ఈ నిర్ణయం మీరెందుకు తీసుకున్నారు అత్తయా, మావయ్యా?"అని రోహిణి అడగ్గానే నరసింహం కల్పించుకొని, "నీకు మా అక్క తెలిసే ఉంటుంది.మా అక్కకు పదిమంది సంతానం. ఆరుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు. మా అక్క తన నలుగురు మగపిల్లలకు బయటి సంబంధాలే చేసుకుంది. ఫలితం నలుగురు కోడళ్ళు వంతులేసుకొని మరీ ,ఆవిడని వేరే ఉంచారు. మా బావగారు పోయినా 85 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా ఆవిడ ఒకర్తే ఇల్లు తీసుకొని, వండుకుని ఉంటోంది. అధిక సంతానమో లేక బయటి సంబంధాల వల్లే కదా తనకి ఇలాంటి స్థితి వచ్చింది. అదే కొడుకుల్లో ఒకరికైనా సరే మేనరికం చేసుకుని వుంటే కనీసం ఆ కొడలైనా చూసుకుంటుంది కదా! కాబట్టి ఇలాంటి స్థితి మాకు కలగకుండా ఉండటానికే మా ఇద్దరి కొడుకులకు మేనరికం చేయదలిచాను" అని చెప్పాడు.

అదేంటి నాన్న! అన్నీ ఆలోచించే మీరు కూడా ఇలా ఆలోచించడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. చిన్నప్పుడు మీరు చెప్పిన కథ గుర్తుకొస్తోంది.

పూర్వం చైనాలో ఒక కుటుంబం ఉండేది. అందులో దంపతులు ఇద్దరు, ఆయన తండ్రి, నాలుగు సంవత్సరాల కొడుకు ఉండేవారు. ఆ కోడలు రోజూ ఆ మామ గారిని తిట్టుకుంటూండేది. అదేవిధంగా ఒక చెక్క బౌల్లో, చాలీచాలని, ఉడికీ

ఉడకనీమెతుకులను పెట్టేది. ఇది గమనించిన ఆయన మనవడు రోజూ బాధపడుతుండే వాడు. ఆ నాలుగు సంవత్సరాల అబ్బాయి ఆ చెక్క బౌల్ ని తీసి దాచేస్తాడు. వాళ్ళ అమ్మానాన్నలు ఆకు(రాణ్ణి చెక్క బౌల్ గురించి అడగ్గా, దాన్ని నేనే దాచాను, భవిష్యత్తులో మీకూ అదే ఉపయోగించాలిగా అని అమాయకంగా చెప్తాడు. అప్పుడు జ్ఞానోదయం అయిన ఆ దంపతులు, తమకూ వృద్ధాప్యం తప్పదని గ్రహించి, తమ మామగారిని జాగ్రత్తగా చూసుకుంటారు." అని తన చిన్ననాటి కథని జ్ఞాపకం తెచ్చుకున్నాడు రోహిత్.

పై కథలో కోడలు మీరనుకున్నట్లుగా బయటి సంబంధం కాదు నాన్న. ఆ వృద్ధుడుకూడా మీలాగే మేనరికం చేశాడు. కానీ ఫలితం చూశారు కదా! కాబట్టి నాన్న! ఆస్తులు బయటికి పోతాయనో,లేక మరేదో విషయంలోనో మీలాగా చదువుకున్న వారు కూడా మేనరికాలు చేస్తున్నారు. నేటి తరం ఎలా తయారైందంటే "కుదిరితే మేనరికం- కుదరకపోతే కులాంతరం" అనే విధంగా తయారైంది.

కాబట్టి నాన్న వీలైనంత వరకు మేనరికాలను మానేద్దాం. ఈ మేనరికాల వలన ఒకే D.N.A. పలు రెప్లికేషన్ లు పొందటం వలన వారి పిల్లలు కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే వారి యొక్క రోగ నిరోధక శక్తి బాగా తగ్గిపోతుంది. ఇంకా అనేక సమస్యలు తలెత్తే ప్రమాదముందని పరిశోధనల వలన తెలుస్తోంది నాన్న!" అందుకే మన తర్వాతి తరానికి మన వారసత్వ సంపదలు ఇవ్వక పోయినా ఫర్వాలేదు గానీ మంచి ఆరోగ్యం మాత్రం ఇవ్వాల్సిన బాధ్యత మనకుంది. అందుకే మేనరికాలు మానితే వంశానుగత వ్యాధులను కొంతవరకూ తగ్గించ వచ్చును అని రోహిత్ చెప్పాడు.

మాకన్నా చిన్నవాళ్ళైనా, ఎంతో ముందుచూపుతో ఆలోచించి, మంచి నిర్ణయం తీసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను" అంది పార్వతమ్మ. మేనరికాల వల్ల జరిగే పరిణామాలేమిటో బాగా వివరించి మాకు మేలుకొలుపుని కలిగించావు నాయనా! మీ ఇష్టప్రకారమే కానీయండి అని నరసింహం అన్నాడు.

– అక్టోబరు, 2011.

❖ ❖ ❖

4. ఆ నలుగురూ...! స'రస్వతీ పుత్రులు

మధ్యాహ్నామవుతుండగానే అనుకున్నట్లుగానే తలుపు చప్పుడయింది. ఆనందంతో వంటింట్లోనుండి రెండే అడుగులలో గుమ్మం దగ్గరికివచ్చి తలుపు తీసింది సుబ్బమ్మ! సుబ్బమ్మకు హఠాత్తుగా హృదయధ్వానం రెండింతలయింది. ఎదుటకనిపిస్తున్న దృశ్యం – ఆమె కంటినుండి ఏకధాటిగా అకాలవర్షాన్ని కురిపించింది. ఎవరొచ్చిందీ తెలుసుకోలేనంతగా ఆమె కళ్ళు మసగబారాయి.

'అబ్బాయొచ్చాడా?' అంటూ పెరట్లోంచి వస్తున్న వెంకన్నకూడా ఒక్కసారిగా నివ్వెరపోయాడు. జడలు కట్టిన జుట్టు... నిప్పు కణికల్లాంటి కళ్ళు... మాసినగెడ్డం... శుష్కశరీరం... ఇవి – అని చెప్పడానికి వీలులేనట్టుగా చేతుల నిండా మచ్చలు, ఇదీ – ఐదు సంవత్సరాల తర్వాత రాకరాక చదువుపూర్తి చేసుకొని కొడుకొస్తున్నాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులకు కనిపించిన 'పరశు రాం' రూపం. అబ్బాయి చేయందుకొని ఆందోళనతో లోపలికి తీసుకొచ్చారు. ఏమయిందో అబ్బాయినడిగి తెలుసుకొనే పరిస్థితుల్లో కూడా వాళ్ళు లేరు. నీరసం, నిస్సత్తువతోపాటు పరాజయం పరశురాం కళ్ళల్లో తళుక్కుమనడంతో మౌనం అతని పెదవులకు కళ్ళెం వేసింది. అంతుపట్టని ఆవేదనతో వెంకన్నాసుబ్బమ్మలిద్దరూ ఒక్కగానొక్క కొడుకు పరశురాం ఆరోగ్యం గురించి ఆలోచనలో పడ్డారు.

❖ ❖ ❖

ఐదు సంవత్సరాల క్రితం పరశురాం ఎం.ఏ. 'గోల్డ్ మెడల్'తో పిహెచ్.డిలో చేరాడు. తలుపుతట్టిన ఉద్యోగాలనుకాదని పరిశోధనకే పెద్దపీట వేశాడు. ఉత్తమ విద్యార్థిగా పేరుతెచ్చుకున్న పరశురాం పరిశోధనలోనూ ఎంతో శ్రమకోర్చి, ఉత్తమ పరిశోధకుడిగాకూడా మన్ననలు అందుకొంటున్నాడు. నాలుగు సంవత్సరాలలా ఉత్సాహంగా ఉన్న పరశురాంకు చదువు పూర్తికాబోతున్న చివరి ఏడాదిలో ఏమయ్యుంటుదన్న ప్రశ్న వెంకన్న మదిలో మెదిలింది.

ఆలోచనల అలజడులనుండి బయటపడి, కొడుకు దుస్థితిని చూడలేక ఆ వూరి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వాళ్ళ కంగారుకు తగినట్టుగా పరశురాముకున్న లక్షణాలను చూసి వైద్యులు అయోమయంలో పడ్డారు. అందుబాటులో ఉన్న వైద్యపరీక్షలన్నీ చేసినా అతనికున్న వ్యాధి శారీరకమో, మనోగతమో వైద్యులు తేల్చి చెప్పలేకపోయారు. ఆ ఊరికి హైదరాబాద్ నూటముప్పైమూడు కిలోమీటర్లు. దూరాలోచన చేసి కష్టపడి కొడుకుని హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రిలో జాయిన్ చేసారతని తల్లిదండ్రులు.

పెద్దాస్పత్రి వైద్యులు కూడా ముందుగా పరశురాం పరిస్థితి గురించి పట్టించుకోలేదు. ఇదేదో సాదాసీదా జ్వరమో మరేదో అనుకొని సాధారణ వార్డులో వుంచారు. మూడురోజులు గడిచాక వారెంత తప్పుచేశారో వారికి తెలిసొచ్చింది. చూస్తుండగానే పరశురాం పరిస్థితిలో విపరీతమయిన మార్పు వచ్చింది. అదేవ్యాధో గుర్తించే లోగానే అతని పరిస్థితి, వ్యాధి లక్షణాలు తీవ్రతరమయ్యాయి. మళ్ళీ అన్ని వైద్యపరీక్షలు చేసినా అందులో ఏమీ తేల లేదు. ఇక అతన్ని అందరితో కలిపి వుంచకూడదని స్పెషల్ వార్డులోకి మార్చి, అతనిపై శ్రద్ధను పెంచారు వైద్యులు.

ఇంతకుముందెప్పుడూ లేని, చూడని లక్షణాలతో బాధపడుతున్న అతని పరిస్థితి పెద్దాస్పత్రి వైద్యబృందానికేమీ అంతుపట్టడంలేదు. వైద్యులందరి నోటా పరశురాం గురించే వార్తలు. ఏ యిద్దరు డాక్టర్లు కలిసినా అతని గురించే మాట్లాడు-కొంటున్నారని సుబ్బమ్మ తన భర్తతో వింతగా చెప్పి బాధ పడుతోంది.

అక్కడి డాక్టర్లకు పరశురాంకు వచ్చిన వ్యాధి ఏమిటో తెలియక, యిదేదో కొత్త వ్యాధి అనే నిర్ణయానికి వచ్చేస్తున్నారు. పరశురాం చేతిమీదమచ్చలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎన్ని రకాల మందులకు లొంగలేదా వ్యాధి. డాక్టర్లందరూకూడా కొత్తరకమైన 'డిసీజ్' అనుకున్నారు. అక్కడి పరిస్థితి గంటలో పూర్తిగా మారిపోయింది. ఆసుపత్రికొచ్చే జనాలందరికీ 'మాస్కులు' పెట్టుకోవాలని ప్రకటనలు చేశారు. ముందుగా వైద్యులందరూకూడా ఇంకా ఏదో 'సార్స్' కు చెల్లో, 'హంటా' కు అక్కో వచ్చిందని అనుకున్నారు.

పరశురాంకు ఇవ్వని మందంటూలేదు. యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్స్... ఇలా ఎన్ని మందులు మార్చి మార్చి యిచ్చినా అతనిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. అసలు అతనికొచ్చింది బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షనో, వైరల్ ఇన్ఫెక్షనో, ఏదీ సరిగా తెలియడం లేదు వైద్యులకు. కొన్ని లక్షణాలు అవీ... మరికొన్ని లక్షణాలు ఇవీ... కలగలసి ఉండడంతో ఎటూ తేల్చుకోలేక సతమతమౌతున్నారు. ఈ కేసు కొంత 'క్రిటికలయినదే' అని ఆలోచించి, పరశురాం విషయాన్ని ఆరోగ్యమంత్రిత్వశాఖకు తెలియజేశారు. ఇది సున్నితమైన విషయమని, వెంటనే ఆ వ్యాధి ఏంటో తెలుసుకుని, వ్యాపించకుండానే అదుపు చేయమని చెప్తూనే రాష్ట్రం మొత్తంమీద ఒక్కకేసుకే భయపడనక్కరనలేదని డాక్టర్లకు సూచన చేశారధికారులు.

ఇదంతా చూసి ఏమీ అర్థంకాక అయోమయంగా ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు సుబ్బమ్మా, వెంకన్నలు. రెండు వారాలు గడిచినా తమకొడుక్కి ఏం జరిగిందో తేలలేదని డాక్టర్లు చెప్పడంతో వారి దు:ఖానికి అంతేలేకుండాపోయింది.

స్పెషల్ రూం కావడంతో కనీసం చూడడానికి కూడా పంపించక పోవడంతో గదిముందే పడిగాపులుపడుతూ కూర్చున్నారు.

❖ ❖ ❖

ఆ హాస్పిటల్‌లోని కాన్ఫెరెన్స్ హాలులో మొత్తం డాక్టర్ల మీటింగ్ జరుగుతోంది. చిన్నా చితకా డాక్టర్లు తప్ప, పెద్ద పెద్ద డాక్టర్లు, పేరు మోసిన డాక్టర్లు అందరూ కూడా అక్కడ మీటింగ్‌లోనే వున్నారు. ఆ మీటింగ్ ముఖ్యోద్దేశ్యం 'పరశురాం - అతనికొచ్చిన వ్యాధి'. పరశురాంను చూసిన డాక్టర్లు ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తమ అభిప్రాయాలను ఆ మీటింగ్‌లో చెబుతుంటే అక్కడున్న మిగిలిన వారికి మతులు పోతున్నాయా అన్నట్టుగా వుందక్కడి పరిస్థితి. డెర్మటాలజిస్ట్, కార్డియాలజిస్ట్, ఎండోక్రైనాలజిస్ట్, న్యూరాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్... ఇలా అందరు స్పెషలిస్టులకుకూడా పరశురాం కేసు తమకు సంబంధించినదిలాగా వుండి, అంతలోనే మళ్ళీ మిగిలిన లక్షణాలూ బయటపడడంతో అందరిలో ఒక పక్క ఉత్కంఠ, మరో పక్క ఈ కేసును ఎలా డీల్ చేయాలో! అనే ఆలోచన.

స్కానింగ్, ఎక్స్‌రే, బ్లడ్ టెస్ట్ రిపోర్టులలో చిన్న చిన్న తేడాలే కానీ పెద్దగా ప్రమాదకరమైన, భయంకరమైన వ్యాధికి సంబంధించినవేవీ లేవనే తెలుస్తోందని డాక్టర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఐతే పేషెంట్‌ను చూసిన మిగిలిన వారందరూ అంటే పారామెడికల్ స్టాఫ్, ఇతర సిబ్బంది మాత్రం అతనేదో తీవ్రమైన వ్యాధితోనే బాధపడుతున్నాడని అనుకొంటున్నారు. ఇది నిజమే అన్నట్టుగా అతణ్ణి ఉంచిన రూం వైపు ఎవర్నీ అనుమతించకపోవడంకూడా రకరకాల వాదనలకు తెరతీసినట్లయింది.

సాధ్యమైనంత తొందరగా పరశురాంను కోలుకొనేటట్టు చేయాలని, అలాగే ఈ విషయాన్ని రహస్యంగా వుంచాలని, లేకపోతే యిదేదో కొత్తవ్యాధి అని ప్రజలు భయపడే అవకాశముందని, అక్కడున్న డాక్టర్లనందర్నీ ఓ సారి హెచ్చరించాడు ఆ హాస్పిటల్ సూపరింటెండెంట్.

❖ ❖ ❖

"చేతిమీదున్న మచ్చలు రోజురోజుకు దద్దుర్లుగా మారిపోయి, ఎర్రగా కమిలిపోయినట్టుగా తయారవుతున్నాయి. అయితే యింతవరకు యిలాంటి కేసు రాష్ట్రం మొత్తంమీద ఇదొక్కటే నమోదయింది. కాబట్టి యిదంటువ్యాధి కాకపోవచ్చు." అని హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు వివరించారు డాక్టర్లు. దానికాయన 'నేను కూడా అదే అనుకుంటాన్నా' అని యింకేదో చెప్పబోతుండగానే రూంలో ఫోన్

రింగయింది. వెంటనే ఒక్కుదుటున ఫోనందనుకున్న సూపరింటెండెంట్ గారి ముఖ కవళికల్లో మార్పొచ్చింది. ఒక్కసారిగా చెమటలు పట్టడంతో తన రుమాల్తో ముఖమంతా అద్దుకొంటూనే ఫోన్లో అవతలి స్వరానికి జవాబేమీ చెప్పకుండా ఒక్క 'సార్.... సార్....' అంటూనే ఫోన్ కట్‌చేసారు.

'ఓ మై గాడ్...' అని తల మీద రెండు చేతులూ పెట్టుకొని బ్రౌన్ కలర్ టేబుల్‌మీద కూలబడిపోతున్నాడా అన్నట్టుగా వాలిపోయిన అతని పరిస్థితి చూస్తున్న డాక్టర్లు అందరూ ఏమయివుంటుందో అని ఆందోళన పడుతున్నారు. ఫుల్ ఏ.సి రూంలో కూడా ఒళ్ళంతా చెమట్లు పట్టి నిస్సత్తువగా కూలబడిపోయి సూపరింటెండెంట్ దగ్గరికి వెళ్ళి విషయమేమిటని మెల్లిగా అడిగారో డాక్టర్.

"ఏం చెప్పమంటారూ..? మెడికల్ & హెల్త్ డిపార్ట్‌మెంట్‌నుండి ఫోనొచ్చింది. మన దగ్గరున్న పేషెంట్ బాధపడుతున్నట్టుగానే రాష్ట్రంలోని మూడు ముఖ్యనగరాల్లో ఒక్కొక్క కేసు బయటపడ్డాయట. అక్కడి డాక్టర్లది కూడా మన పరిస్థితేనట. అందుకే ఆ ముగ్గుర్నికూడా వేరే వేరే అంబులెన్సుల్లో మన దగ్గరకు పంపిస్తున్నారట. ఇక మొత్తం బాధ్యత మనదేనని హెచ్చరించారు." అని గద్గద కంఠంతో అసలు విషయం చెప్పారు సూపరింటెండెంట్. ఆ మాట వింటూనే డాక్టర్లంతా నిర్ఘాంతపోయారు. 'ఇప్పుడు మన పరిస్థితి...?' అన్నట్టుగా అందరూ సూపరింటెండెంట్ వైపు చూశారు. కాసేపక్కడంతా నిశ్శబ్దమావరించింది. వెంటనే తేరుకున్న సూపరింటెండెంట్ మాట్లాడుతూ ' ఇక చేసేదేముంది!? స్పెషల్‌వార్డునొకదాన్ని కేటాయించండి. వాళ్ళపై శ్రద్ధ మరింత పెంచండి. అవసరమైతే స్పెషలిస్టులనెంత దూరంనుండయిన రప్పించి, వాళ్ళకొచ్చిన వ్యాధి ఏంటో తెలుసుకొని, తొందరగా క్యూరయ్యేలాగ తగిన చర్యలు తీసుకోండి" అని ఆజ్ఞాపించి ఛైర్లోంచి లేచి వెళ్ళిపోయాడు సూపరింటెండెంట్. ఆ పన్లో పడ్డారు డాక్టర్లు.

రెండు అంబులెన్సుల్లో యిద్దర్ని నేరుగా అక్కడికే చేర్చారు. ఇక మూడో అంబులెన్సు రావడానికి కొంత సమయం పట్టింది. రాష్ట్రంలోని ప్రముఖ నగరాలవడంతో 'ఈ కేసులు కొంత జటిలమైనవే' అని డాక్టర్లంతా అనుకొన్నారు. ఆ యిద్దర్నీ కూడా పరశురాం పక్క విడివిడిగా వున్న రూంలలో వుంచి ట్రీట్ చేస్తున్నారు. మూడో అంబులెన్సు డ్రైవర్ 'చిట్టిబాబు'కు కొంత వాచాలత్వమెక్కువ. అడిగిన వారికీ అడగని వారికీ అన్ని విషయాలు చెప్పేస్తుండడం అతని అలవాటు. ఆ అలవాటు మార్చుకోమని ఎంతమంది చెప్పినా పెడచెవిని పెట్టి తన పంథా మార్చుకోలేదు. హైదరాబాద్ వస్తూ వస్తూ దారిలో ఓ చోట 'టీ' కోసమని అంబులెన్సు ఆపి దిగివెళ్ళాడు. 'టీ' కొట్లో పరిచయమయిన ఒక యువకుడితో మాటల్లో పడి

తను హైదరాబాదు వెళ్తున్న విషయం, అంబులెన్సులో వున్న పేషెంట్ వివరాలు చెప్పేశాడు. సాధారణ యువకుడిగా భావించి తన దగ్గరున్న ఇన్ఫర్మేషన్ మొత్తం అతనితో చెప్పి తిరిగి అంబులెన్సు స్టార్ట్ చేసి హైదరాబాదు బయలుదేరాడు. 'టీ' కొట్లో పరిచయమయిన ఆ యువకుడు జర్నలిస్ట్. తను పనిచేస్తున్న న్యూస్ ఛానల్‌కు ఓ మెసేజ్ పంపించి, అటునుండి అటే హైదరాబాదు బయలుదేరాడు.

నేరుగా హాస్పిటల్ చేరుకుని అక్కడి పరిస్థితులను చూసి నివ్వెరపోయాడతడు. స్పెషల్‌వార్డు పరిసరాలలోకి ఎవర్నీ అనుమతించకపోవడం కూడా అతనికి అనుమానం కలిగించింది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అక్కడున్న డాక్టర్లను విషయం అడిగాడు. వెంటనే ఆ డాక్టర్లలో ఒకరు 'నువ్వెవరూ..? అసలు నీ కెందుకు చెప్పాలి' అని గట్టిగా అడిగే సరికి జేబులోనుండి తన ఐ.డి. కార్డును తీసి చూపించాడా యువకుడు. 'నా పేరు యశ్వంత్' అని పరిచయం చేసుకోగానే డాక్టర్లందరూ తడబడ్డారు. అప్పుడే మీడియాకెలా తెలిసిందన్నది వారి ఆంతర్యం. వారి తత్తరపాటును గమనించిన యశ్వంత్ వెంటనే గ్రహించాడు వారేదో దాచిపెడుతున్నారని.

"అసలిక్కడేం జరుగుతోంది? - ఏదో కొత్తవ్యాధి ప్రబలుతున్నా కూడా మీరెందుకు ప్రజలకు, మీడియాకు ఇన్ఫర్మేషన్ యివ్వలేదు? - ఇప్పటివరకు రాష్ట్రం మొత్తంమీద నలుగురు యువకులకు వ్యాధిలక్షణాలు బయటపడినా ఎటువంటి చర్యలూ ఎందుకు తీసుకోలేదు?" అంటూ ప్రశ్నలవర్షం కురిపిస్తున్న యశ్వంత్‌కు ఏం సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయారు డాక్టర్లు. అంతే 'బ్రేకింగ్ న్యూస్' అంటూ టీ.వీ. లో యీ వార్త బయటకు రాగానే రాష్ట్రమంతా గుప్పుమంది. భయాందోళనతో కంపించిపోయింది. ఇక అందరినోట్లో యిదే వార్త. ఎలా వ్యాపిస్తుందో అన్న పుకార్లు మొదలయ్యాయి. ఈ వార్త అలా... అలా... మంత్రులవరకు, చివరకు సి.ఎం. దాకా వెళ్ళిపోయింది. ఇదెదో అంటువ్యాధంటూ వ్యాపించిన పుకార్లవల్ల రవాణావ్యవస్థ స్తంభించి పోయింది. బస్సులు, లారీలే కాదు చివరకు రాష్ట్రానికి - యితర దేశాలు, రాష్ట్రాలనుండి కూడా విమాన సర్వీసులు రద్దయిపోయాయి. అంతు చిక్కని వ్యాధిగా, అంతరిక్షంనుండి వచ్చిన వ్యాధిగా ఎన్నెన్నో పుకార్లతో ప్రజలు హడలెత్తిపోయారు. అందరూ కూడా 'మాస్కులు', 'గ్లౌజు'లతో తిరగడం మొదలైంది. విద్యాశాఖ స్కూళ్ళకు సెలవులు ప్రకటించింది. ఉద్యోగస్తులంతా సెలవులు పెట్టి మరీ ఇళ్ళలోనే ఉండి పోయారు. దేనివల్ల వస్తుందో, ఎలా వస్తుందో తెలియదని డాక్టర్లే చెప్పడంతో దేన్ని చూసిన అనుమానించే వారెక్కువయ్యారు.

రాష్ట్రంలో పరిస్థితి ఒక్కరాత్రిలో మారిపోయింది. పరిస్థితి యిలాగే కొనసాగితే కష్టమని వెంటనే ఏదో ఒకటి చేయాల్సిందిగా ఆరోగ్యశాఖను ఆదేశించారు సి.ఎం.

– ఆరోగ్యశాఖ ఆ హాస్పిటల్‌లో డాక్టర్లకు అక్షింతలు వేసి, "సరే జరిగిందేదో జరిగిందని ఇప్పటికైనా మేల్కొని, ముగ్గురు డాక్టర్లతో కూడిన 'త్రిసభ్యకమిటీ'ని వేసి, తమ నివేదికను సాధ్యమయినంత తొందరగా సమర్పించాలని ఆజ్ఞలు జారీ చేసింది. దాంతో అనుకున్నట్లుగానే ఒక డెర్మటాలజిస్ట్, ఒక న్యూరాలజిస్ట్, అలాగే ఒక సైకియాట్రిస్ట్‌లతో కమీటీని నియమించారు.

డెర్మటాలజిస్ట్, న్యూరాలజిస్ట్‌లు ఆ స్పెషల్‌వార్డులోకి వెళ్ళకముందే ఓసారి వాళ్ళ కేర్ షీట్ మొత్తం పరిశీలించారు. అనుమానం వున్న పాయింట్లను రెడ్‌పెన్‌తో రౌండప్ చేసుకున్నారు. వేరు వేరు రూముల్లో వున్న వాళ్ళందర్నీ చూసొచ్చేశారు. నలుగురికీ ఒకేలాంటి లక్షణాలున్నాయి. నలుగురూ యించుమించు సమవయస్కులు. కానీ ఆ నలుగురికీ ఎలాంటి సంబంధంలేదని ఆ స్పెషలిస్టుల నమ్మకం. ఎందుకుంటే నలుగురూ నాలుగు మూలలనుండి వచ్చారు. అందుచేత 'ఇది క్రిటికలే' అని అనుకున్నారు. వాళ్ళు పూర్వమెప్పుడూ కూడా విదేశాలు వెళ్ళిరాలేదని వాళ్ళ బంధువుల వల్ల, తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్నారు. డెర్మటాలజిస్ట్ వాళ్ళ చర్మాన్ని మొత్తం పరీక్షించి, లక్షణాలన్నింటినీ నోట్ చేసుకుని టెస్ట్ రిపోర్టులను పరిశీలించి, చివరి ప్రయత్నంగా వాళ్ళ 'స్కిన్ స్క్రాపింగ్' సాంపిల్స్‌ను కల్చర్‌కు పంపించారు.

ఇక ఆ నలుగురి 'బ్రెయిన్ స్కానింగ్' రిపోర్టులను పరిశీలించిన న్యూరాలజిస్ట్, వారి నాడీకణాలలో కొంత తేడాను గుర్తించారు. ఇలాంటి లక్షణాలను ఎప్పుడూ చూడలేదని మిగిలిన డాక్టర్లతో చెప్పడం వారందరికీ కొత్తనిపించలేదు. డాక్టర్లు, ఆ యువకుల తల్లిదండ్రులు, బంధువులు అందరూ కూడా టెన్షన్ పడుతుంటే – చాలా కూల్‌గా... నిదానంగా వున్నది ఒకేఒక్కరు. ఆవిడే సైకియాట్రిస్ట్ 'హిమబిందు'.

అందరూ కూడా వ్యాధి... వ్యాధి లక్షణాలు... యిది ఎలా వస్తుందనే ఆలోచిస్తున్నారు, చూస్తున్నారు. కానీ 'హిమబిందు' మాత్రం అసలా నలుగురు ఏం చేస్తుండేవారు? వారి దినచర్య ఎలా వుండేది? వారి ఆహారపు అలవాట్లు ఏమిటి? అనే అంశాలను తెలుసుకునే పనిలో పడింది. ఆ స్పెషల్ వార్డులోకి వెళ్ళబోతూ, అక్కడే బయటి చెక్కబల్ల మీద నీరసంగా, నిస్సత్తువగా కూర్చోలేక కూర్చున్న వృద్ధదంపతుల పైన పడిందామె దృష్టి. రెండడుగులు వెనక్కి వేసి, వాళ్ళ దగ్గరకు వెళ్ళి "ఎవరండీ మీరు? ఇక్కడున్నారేం?" అని అనునయంగా అడిగింది హిమబిందు. "నా పేరు వెంకన్న. ఈవిడ నా భార్య సుబ్బమ్మ. లోపల మా అబ్బాయి పరశు రామున్నాడమ్మా. వాడికేమయిందో ఏ ఒక్కరూ చెప్పట్లేదమ్మా.! వాడసలూ బతికేవున్నాడో లేదో చూద్దామన్నా లోపలికి వెళ్ళనివ్వడం లేదమ్మా.!" అని దీనంగా చెబుతున్న వాళ్ళమీద జాలేసింది హిమబిందుకు. "మీ అబ్బాయికి ఏం జరగలేదండి.

పరశురాంను నేను మీకు చూపిస్తాను, మాట్లాడిస్తానుకూడా. అయితే మీరు యిలా వుంటే మీ అబ్బాయి బాధ పడతాడు కదా? పదండి! ముందు భోజనం చేసి, అలా మీ యింటికి వెళ్ళి, శుభ్రంగా స్నానం చేసి, బట్టలు మార్చుకొని వస్తే - లోపలకు తీసుకొని వెళతా' అని చెప్పగానే కొడుకుని చూడాలనే ఉత్సాహం వాళ్ళ కళ్ళల్లో కనిపించిందామెకు. కానీ ఎలా? అన్న ఆలోచన ఒకవైపు, ఎవరో వచ్చి చెబితే నమ్మేయడం ఎలా? అనే అలోచన మరోవైపు వెంకన్న మదిలో మెదిలింది. వెంటనే సుబ్బమ్మ ఓపిక తెచ్చుకొని " ఇంకేం ఆలోచించక ఆ అమ్మగారు చెప్పినట్టు చేద్దాం" అని బలవంతపెట్టేసరికి, సరేనని తలాడించాడు వెంకన్న. వెంటనే వారిద్దరికీ మంచి భోజనం పెట్టించి, అక్కడి నుండి తన కారులోనే వారి వూళ్ళో యింటికి తీసుకెళ్ళింది హిమబిందు.

చాలా రోజులనుండి యింట్లో ఎవరూ లేకపోవడం వల్ల యిల్లంతా బోసిపోయినట్టయింది. వాకిట్లో 'కారు'నాపగానే వెంకన్న ముందు దిగి, తాళాలు తీశాక - సుబ్బమ్మ, హిమబిందులు దిగి యింట్లోకి వెళ్ళారు. పల్లెటూరులో ఇల్లు కాబట్టి, ఏదో సాదాసీదాగా వుంటుదనుకొన్న హిమబిందు, ఆ యింటిని చూసి ఫర్వాలేదనుకొంది. వెంకన్న, సుబ్బమ్మలు 'ఇదే మా పరశురాం గది.' అని చూపించగానే 'అవునా..!' అని మొహమాటంగా ఓనవ్వునవ్వింది. గదిలో వున్న పుస్తకాల అమరిక, రూం డెకరేషన్ని బట్టి 'వెల్ ఎడ్యుకేటడే' అనుకొంది. 'ఇంతకీ మీ అబ్బాయి ఏం చదువుకొన్నాడు?' అని సుబ్బమ్మను అడగ్గానే, వెంకన్న అందుకుని "ఎం.ఏ చదివాడు. ఆపైన అదేదో 'పిహెచ్.డి' అటమ్మా. అది చదువుతున్నాడు" అని చెప్పాడు. "మా వాడు మంచి తెలివైన వాడమ్మా. అందుకే ఎం.ఏ.లో బంగారుపతకం కూడా వచ్చింది." అంటూ ఆనందపడుతూ లోపలకు వెళ్ళి బీరువాలో వున్న 'గోల్డ్ మెడల్' తెచ్చి చూపించాడు వెంకన్న.

'ఎక్సలెంట్' అని మెచ్చుకొని, యింతకీ మీవాడు ఏ సబ్జెక్టులో ఎం.ఏ. చదివాడు?' అని అడగ్గానే 'తెలుగు' అని సమాధానమిచ్చాడు వెంకన్న. ఎం.ఏ. చదివి 'పిహెచ్.డి' చేస్తున్నాడంటే తెలివైనవాడే అని అనుకొంది మనసులో. అక్కడున్న పుస్తకాలను చూస్తూ అలా ముందుకు నడుస్తుంటే ఆమె కాళ్ళకు అడ్డంగా తగిలిందేంటో? అని చూస్తే అది సూట్‌కేసు. "అది మా అబ్బాయిదేనమ్మా. మొన్న వూరినుండి వచ్చినపుడు అది పట్టుకొనే వచ్చాడమ్మా. అసలు వాడికి చిన్నప్పటినుండి జ్వరమైనా వచ్చి ఎరగడమ్మా." అంటూ ఇంకేవో చెబుతున్నా... అవేమీ ఆమె వినిపించుకోకుండా ఆ సూట్‌కేస్‌ను తీక్షణంగా చూసి, అందులో ఏమయినా ఆధారాలు

దొరకవచ్చునేమోనని, ఓపెన్ చేసి చూసింది. అందులో వ్యక్తిగత విషయాలు ఏమీ లేవు. కానీ, డాక్టర్ హిమబిందుకు ఏం కావాలో అది అందులో వుంది. ఆమెకు ఓ డైరీ కనిపించింది. తనకు కావాల్సింది దొరికిందని సంతోషించి, వాళ్ళతో ఆ డైరీ పట్టుకెళ్తానని చెప్పి, వెంటనే బయలుదేరబోతూ, వాళ్ళుకూడా రెడీ అయ్యే వరకూ వుండి, ముగ్గురూ కలిసి మళ్ళీ హాస్పిటల్‌కు చేరుకున్నారు. వాళ్ళనక్కడ దింపి, తిన్నగా తను మాత్రం యింటికెళ్ళి, ఫ్రెషయ్యాక తనతో తెచ్చిన డైరీని చదివింది. మొత్తమంతా చదివాక 'ఓ మైగాడ్!' అనుకొని వెంటనే డాక్టర్లనందర్నీ మీటింగ్‌కు అటండ్ అవ్వాల్సిందిగా మెసేజ్ పంపింది. ఏదో సీరియస్ మేటరేనని అందరూ వారి వారి పనులు మానుకొని హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో డాక్టరు హిమబిందు గురించి ఎదురుచూస్తున్నారు.

'ఆవిడ ఏం చెబుతారో? యింతకీ ఆ వ్యాధికి సంబంధించిన క్లూ ఏమైనా దొరికిందో లేదో?' అని వారందరికీ అంతకంతకు ఆతృత పెరిగిపోతోంది. అక్కడి పరిస్థితి ఎలా వుందంటే సూపరింటెండెంట్ కూడా ఎక్కడికీ వెళ్ళకుండా హిమబిందు ఏం చెబుతుందోనని నరాలు బిగబట్టుకొని కూర్చున్నారు.

సాయంత్రం ఐదు గంటలకు హిమబిందు కాన్ఫరెన్స్ హాల్లోకి అడుగు పెట్టగానే అందరూ అలెర్టయ్యారు. ఆమె చేతిలో వున్న డైరీ పైన కొంతమంది డాక్టర్ల దృష్టి పడింది. ఎంత తొందరగా స్పీచ్ స్టార్ట్ చేస్తుందోనని వారంతా ఎదురుచూస్తున్నారు. మైక్ దగ్గరకు వచ్చి హిమబిందు "గుడీవినింగ్ ఫ్రెండ్స్" అనగానే అక్కడ నిశ్శబ్దమావరించింది. "మన దగ్గరున్న పేషెంట్స్ నలుగురిలో మొదట ఎడ్మిటైన పరశురాం ఏం చదువుకున్నారో ఎవరికైనా తెలుసా?" అన్న హిమబిందు ప్రశ్నకు సమాధానం రాలేదు. "అతను పిహెచ్.డి స్కాలర్" అని ఆమె చెప్పగానే "అయితే ఏమిటి?" ఓ డాక్టరు ప్రశ్నించారు. "ఒక్క నిమిషం... అక్కడకే వస్తున్నానంటూ కాసేపు గట్టిగా ఊపిరి పీల్చి, విడిచి పెట్టి... అతని రీసెర్చి టాపిక్ - వేమన" అని చెప్పగానే, అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని "దానికీ, దీనికీ ఏం సంబంధం" అని చెవులు కొరుక్కొంటున్నారు.

ఆమె ఏం చెబుతోందో అర్థంకాని సూపరింటెండెంట్ లేచి, నించుని "సో వాట్? యిది చెప్పడానికా అందర్నీ రమ్మన్నారు? మా పనులు మానుకొని వచ్చినందుకు మమ్మల్ని ఫూల్స్ చేస్తున్నారా?" అని యింకేదో అనబోతుంటే, "కూల్ సార్... కూల్." అని హిమబిందు చెప్పడం కొనసాగించింది. "నేను కూడా మొదట యిలాగే అనుకొన్నాను. అసలు 'యోగి వేమన'కు ఈ పరిస్థితికి ఏమిటి సంబంధమని! పరశురాం రాసుకొన్న యీ డైరీ చదివాక అసలు విషయం అర్థమయింది." అని

ఆమె చెప్పగానే "యింతకీ అందులో ఏముంది?" అని అందరూ ఒక్కసారిగా అడిగారు. ఈ డైరీలో అతను చేసిన, చేస్తున్న, చేయబోతున్న రీసెర్చి ప్లాన్ వుంది. పిహెచ్.డి లో చేరిన దగ్గర నుండీ ఐదు సంవత్సరాలకు, ఒక్కొక్క ఏడాది వేమనలోని, వేమన పద్యాలలోని ఒక్కొక్క అంశాన్ని పరిశోధించడం మొదలుపెట్టారు పరశు రాం" అంటున్న హిమబిందు మాటలు అర్థంకానట్టుగా అందరూ విస్తుపోయి ఆమెనే చూస్తున్నారు. అతని ప్రణాళిక ప్రకారం మొదటి ఏడాది 'వేమన పద్యాల్లోని హాస్యం', రెండో యేడు 'వేమన - నీతులు', మూడు, నాలుగు సంవత్సరాల్లో వరుసగా వేమనలో 'సంఘ సంస్కరణాద్భుకృథం', 'హేతువాదం' అనే అంశాలపైన రీసెర్చి చేశారు. ఇంత వరకూ బాగానే వుంది. ఇక యిక్కడినుండి కథ అడ్డం తిరిగింది. ఆఖరి సంవత్సరంలో అతని రీసెర్చి టాపిక్ ఏంటో తెలుసా?" అని ఒకసారి అందరి ముఖాల్లోకి చూసి, కొంచెం మంచినీళ్ళు తాగి, తిరిగి చెప్పడం ప్రారంభించింది. "వేమన పద్యాల్లో రసవాదం!" అని కాసేపాగింది. డాక్టర్లందరికీ కూడా యింకా అయోమయస్థితి పోలేదు. అందులో ఒక డాక్టరడిగాడు - "రసవాదమంటే ఏంటీ?" అని. "నాక్కూడా రసవాదమంటే ఏంటో తెలియదీ డైరీ చూసేదాక. రసవాదమంటే బంగారం తయారు చేయడమట!" అనగానే అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. " యూ మీన్... మేకింగ్ ఆఫ్ గోల్డ్?" అని ఓ డాక్టరు మాటకు - "యస్స్... యూ ఆర్ కరెక్ట్. బంగారం తయారు చేయడమెలాగో వేమన పద్యాల్లో వుందని యిప్పటికీ చాలామంది నమ్ముతుంటారు. అయితే ఎవరో చదువులేని వాళ్ళు యిలా అనుకున్నారంటే ఫరవాలేదు. కానీ... పరశురాంలాంటి ఉన్నత విద్యావంతులుకూడా నమ్మి యిలా చేస్తారని నేనిప్పుడే తెలుసుకొన్నాను." అయితే "రసవాదంలో ఏం చేస్తారు" అని డెర్మటాలజిస్ట్ అడిగారు. అందుకు సమాధానంగా "పాదరసాన్ని కొన్ని మూలికలుపయోగించి ఘనీభవింపజేస్తారట. ఆ తరువాత దానికి 'కాపర్' అంటే రాగిని కలిపితే 'గోల్డు కలర్' వస్తుందట. ఇక ఆ తరువాత మిగిలింది 'మోలిక్యులార్ వెయిట్' తెప్పించడమేనట." అంటున్న హిమబిందు మాటలు మిగతా డాక్టర్లందరూ చెవులు రిక్కించుకుని వింటున్నారు.

"రసవాదం గురించి సాహిత్యపరిశోధనమాని యిలా బంగారం కోసం ప్రయోగాలు మొదలుపెట్టారు పరశురాం. అలా సంవత్సరం నుండి పాదరసంతో అదే పనిగా ప్రయోగాలు చేయడం వల్ల అతనికీ స్థితి దాపురించిదని నాకనిపిస్తోంది." అని చెప్పి తన సుదీర్ఘ ప్రసంగాన్ని ముగించింది. "అంటే...!" అని ఓ డాక్టరడగబోతుంటే... "ఇటీజ్ నత్తింగ్ బట్ ఎ కెమికల్ రియాక్షన్ ఆఫ్ మెర్క్యురీ" అని విపులీకరించింది హిమబిందు. వెంటనే డాక్టర్లంతా "పోనీ - పరశురాం అలా

చేసుంటాడు. మరి మిగిలిన ముగ్గురి పరిస్థితి...?" అనగానే "ఆ... అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మిగతా ముగ్గురూ కూడా పరశురాం స్నేహితులే. వీళ్ళు నలుగురూ కలిసే ఆ ప్రయోగాలు చేశారట" అని డైరీలో విషయాన్ని వివరించింది. ఇంకా అనుమానంగాచూస్తున్న డాక్టర్ల సందేహమర్థమయినట్టు తలూపి– "వాళ్ళు నలుగురూ వుండేది వేరు వేరు వూళ్ళైనా.. పిహెచ్.డి చేసేది మాత్రం ఒక యూనివర్సిటీలోనే" అని సమాధానపరిచింది.

అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుని సూపరింటెండెంట్ వైపు తిరిగారు. వెంటనే వెళ్ళి కెమికల్‌రియాక్షన్‌కు ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేయమనగానే వాళ్ళంతా గండం గడిచిందనుకొంటూ ఆ పనిలో పడ్డారు. సూపరింటెండెంట్ బయటకు వెళ్ళి - అక్కడే ఎదురుచూస్తున్న మీడియా వారికి విషయాన్ని వివరించారు. అలాగే యీ వార్తను మెడికల్ & హెల్త్ డిపార్ట్‌మెంట్‌కీ తెలియపరిచేరు.

మరునాడు - ఒక ప్రముఖ దినపత్రికలో "ఆ నలుగురూ.... సరస్వతీ పుత్రులు" అని మల్టీకలర్‌లో ప్రధానశీర్షిక కింద ఈ కథనం యావత్తు సంచలన వార్తగా ప్రచురించబడింది.

- ఆగష్టు, 2012.

❖ ❖ ❖

5. యజ్ఞాశ్వం

సాయంత్రం 5 గంటలు అవుతుండటంతో వాకిట్లో మొక్కలకు నీళ్ళు పోస్తూ ఇక ఈయనొచ్చే వేళయ్యిందనుకుంటున్న గీతకు బండి హారన్ లీలగా వినిపించింది. చేస్తున్న పనిని చకచక ముగించి గేటు తీసి భర్త రాకను గమనిస్తూ నిలబడింది గీత.

కొంత దూరంనుండే గీతను చూసిన కృష్ణ మొహంలో అప్పటి వరకూ ఉన్న చిరాకు పోయి, ఆనందం వెల్లివిరిసింది. బైక్‌ను తిన్నగా ఇంటి వాకిట్లోకి ఎక్కించేసి, బండి దిగి తాళం వేస్తూ, ఇంటర్వ్యూ లెటర్లేమైనా వచ్చాయా? అని అడిగాడు కృష్ణ. కొత్తగా ఏమొస్తాయండీ అంటూ అలవాటుగా భర్త చేతిలోని కారియర్ బ్యాగ్ నందుకొని భర్త కన్నా ముందే లోపలకు వెళ్ళిపోయింది గీత. షూ విప్పి లోపలకు వస్తున్న భర్తకు మంచి నీళ్ళందిస్తూ "ఈ సంవత్సరం కూడా ప్రమోషన్ రావడం లేదా?" అని అడిగిన భార్య వైపు చూసి, ఏమో? ఎవరికి తెలుసు? ప్రమోషన్ అన్నది మన ఇష్టమా? మన చేతిలో ఉంటుందా?? అంతా మేనేజ్‌మెంట్ ఇష్టమే". అని అన్నాడు.

"అక్కడ జాయినయి నాలుగేళ్ళు దాటి అయిదో సంవత్సరం లోకి అడుగు పెట్టారు, మన పెళ్ళైన మూడేళ్ళలో మనకొక బాబు పుట్టుకొచ్చాడు గానీ, ఐదు సంవత్సరాలైనా కూడా ఏ ఎదుగూ బొదుగూ లేకుండా ఒకే పోస్ట్‌లో ఉండిపోయారు. పైగా ఆఫీసులో బెస్ట్‌వర్కర్ అవార్డులు మాత్రం మూడు వచ్చాయి. ఆ అవార్డులు ఏం చేసుకుంటారు? మీరు జాయిన్ అవ్వనంత వరకు అసలు ఆ కంపెనీ పేరే ఎవరికీ తెలిసేది కాదటగా! అలాంటిది మీరు జాయినయ్యి, మీ సొంత తెలివి తేటలతో, ఇప్పుడు నెంబర్ 1 గా నిలబెట్టారు" అని మాట్లాడుతున్న గీత వైపు ఎర్రగా ఓ చూపు చూశాడు కృష్ణ. అంతే మ్యూట్ నొక్కిన టి.వి.లాగా మారు మాట్లాడకుండా నిలబడిపోయిందామె.

"అయినా ప్రమోషన్ రాలేదనే చిన్న కొరత తప్పించి, మిగిలిన వన్నీ బాగానే ఉన్నాయి కదే, పైగా ప్రతి సంవత్సరం 5000 ఇంక్రిమెంట్ కూడా ఇస్తున్నారు కదా!! ఇప్పుడు మనకేంటి ఇబ్బంది? నేను రోజూ అలా ఇంటర్వ్యూ లెటర్ల గురించి అడగకపోతే నాకు ఇప్పుడున జాబ్ బోర్ కొడుతుంది కదా! ఇక నేను జాయినయ్యాక కంపెనీ నెంబర్ - 1 లోకి రావడం అన్నది నా ఒక్కడి వల్లే కాదు, మిగిలిన వారందరూ కష్టపడి పనిచేస్తున్నారు. అందుకని అవన్నీ బుర్రలో పెట్టుకోకుండా వెళ్ళి వేడి వేడిగా కాఫీ పట్టుకు రా" అని గీతకు చెప్పి , అక్కడే వాకర్లో ఉన్న సంవత్సరంన్నర కొడుకు "వసంత్" ను ముద్దులాడుతూ కూర్చున్నాడు.

వేడి కాఫీని చేతికందిస్తూ, అయినా మీరొకసారి మళ్ళీ ఆలోచించండి. ఇన్నాళ్ళూ మీరూ, నేనే కనుక ఈ జీతం సరిపోయేది. ఇప్పుడంటే పిల్లాడు పెద్దవాడవుతున్నాడు కదా! వాడి భవిష్యత్తును ఇప్పటి నుండే మనం జాగ్రత్త పడాలన్నదే నా సలహా!! అని చెప్పి, కృష్ణ ఇచ్చిన కాఫీ కప్పునందుకుని లోపలకు వెళ్ళిపోయింది గీత.

తమ పెళ్ళైన మూడు సంవత్సరాలలో తను గీసిన గీత దాటని 'గీత' ఇప్పుడు ఇంతలా చెబుతోందంటే కొంచెం ఆలోచించాల్సిన విషయమే అనుకొని, మళ్ళీ అంతలోనే గీతా! అని కేక వేసి, ఇలా చూడు, నువ్వు చెప్పినది కరక్టే, కానీ ఇప్పటికిప్పుడు నాకు మంచిఉద్యోగం వచ్చి నేను ఉద్యోగం మారిపోతే, ఇన్నాళ్ళు నన్ను నమ్ముకొని, నా మీద బాధ్యతలు పెట్టిన ఈ కంపెనీవాళ్ళను నేను మోసంచేసినట్లవుతుంది కదా!! అది మనకే ప్రమాదమేమోనని ఆలోచిస్తున్నాను. కాదూ కూడదంటావా, ఇంతకన్నా మంచి జాబ్ వస్తే అప్పుడు చూద్దాంలే, ఎందుకంటే ఇప్పటి వరకు వచ్చినవన్నీ ఇంత కన్నా తక్కువవే కాబట్టి, నువ్వేమీ కంగారు పడకుండా నిశ్చింతగా ఉండు" అని చెప్పాడు.

భర్త తెలివితేటలు, సామర్థ్యం బాగా తెలిసిన గీత, కృష్ణ చెప్పిన మాటల్లో నిజముందని గ్రహించి, మీ యిష్టమని చెప్పి లోపలకు వెళ్ళిపోయింది. తను అలా వెళ్ళగానే వాకర్లో నున్న వసంత్‌ను ఎత్తుకుని లేచేసరికల్లా ఎదురుగుండా అలమరలో అందంగా అమర్చిన మెమొంటోలు, చిన్నప్పుడు తనకొచ్చిన ప్రైజ్ ల పైన పడిందతని దృష్టి. ఇంతలో భుజం మీదనున్న బాబు ఏడ్వడంతో, వాటి నుంచి దృష్టి మరల్చి, బాబును ఊరుకో బెట్టే పనిలో పడ్డాడతను. గీత చెప్పినంతవరకూ కాకపోయినా, నిజానికి తనకున్న తెలివితేటలకు ,తను చేస్తున్న ఉద్యోగం సరి కాదని, ఇంకా ఎక్కువ సంపాదించే తెలివితేటలు తనకున్నాయని ఓసారి అనుకున్నాడతను.

మరుసటిరోజు ప్రొద్దునే కారియర్ బాగ్ చేతికందిస్తూ సాయంత్రం తొందరగా వచ్చేస్తే బయటకు వెళ్దామా? అన్న గీతతో సరేలే చూద్దాం అని రిస్ట్ వాచ్ చూసుకుని, అమ్మో టైం అయిపోతోంది,ఆఫీసుకు వెళ్ళిపోవాలంటూ, బైక్ స్టార్ట్ చేసి, వెళ్ళిపోయాడు. బైక్ వీధిమలుపు తిరిగేంత వరకు చూస్తూ నిలబడిన గీత వైపు చూడకుండా, ఎప్పుడూ వర్క్‌మైండ్‌తోఉండే కృష్ణ, అలవాటుగా మలుపుదగ్గర హారన్ కొట్టుకుంటూ వెళ్ళిపోయాడు. అలా తిరగ్గానే, భారంగా నిట్టూర్చి, మిగిలిన పనుల్లో పడిందామె.

సాయంత్రం 5 గంటలకు ఆఫీసు నుండి ఇంటికి వస్తూ, వీధి చివర నుండీ హారన్ కొట్టినా గానీ, గీత బయటకు రాకపోయేసరికి ఏమైౖ ఉంటుందబ్బా అని ఆలోచిస్తున్న కృష్ణ, ఇంటి ముందు ఆగి ఉన్న ఫారెన్ కారుని చూసి, మన ఇంటికి

ఫారెన్ కార్లో వచ్చే వారెవరబ్బా?? అని అనుకుంటూ, బైక్ బయటాపి దిగి గేటు తీసి బండి లోపల పెడుతుంటే, ఇంట్లోంచి బయటికొచ్చి, యథాలాపంగా కారియర్ బ్యాగ్ అందుకున్న భార్యతో, ఇంటర్వ్యూ లెటర్లేమైనా వచ్చాయా? అని అడిగిన అతన్ని చూసి, చిన్నగా నవ్వి, లేటరేంటండి,ఇంటర్వ్యూ చేసే వారే మన యింటికి వచ్చారండి" అని సమాధానమిచ్చింది.

ఏంటే నువ్వు చెప్పేది? ఇంతకీ ఎవరొచ్చారు? అని అడుగుతూనే హాల్లోకి అడుగు పెట్టగానే ఎదురుగా సోఫాలో కూర్చుని, కాఫీ త్రాగుతూ ,అక్కడే టీ పాయ్ మీదనున్న మాగజైన్ చదువుతున్న వ్యక్తిని చూసి ఒక్కసారి ఆశ్చర్యపోయి, అంతలోనే ఆనందపడ్డాడు. అప్పటి వరకూ కూర్చొన్న ఆ వ్యక్తి ,కృష్ణను చూడగానే ఒక్కసారిగా లేచి నిలబడి, హాయ్ రా కృష్ణ , హౌ ఆర్ యు? ఎంత కాలమైందిరా మనం కలసి, అంటూ నవ్వుతూ పలకరించాడు. ప్రతి స్పందనగా కృష్ణ కూడా, హాయ్ రా అర్జున్ ఎలా ఉన్నావ్? ఇన్నాళ్ళూ ఏమైపోయావ్? షడన్‌గా ఎక్కడి నుండి ఊడి పడ్డావ్ రా? ఈ సూటేంటి? అసలేం చేస్తున్నావ్? అని ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తూ పలకరించాడు.

"ఆగాగు! అన్నింటికి నింపాదిగా నేను సమాధానాలు చెబుతాను.బాగా అలసిపోయి వచ్చావు, ముందు నువెళ్ళి రిఫ్రెష్ అయ్యిరా!! నేను ఇక్కడే ఉంటాను" అని అర్జున్ అనగానే వెంటనే గీతను లోపలకు పిలిచి ,వీడూ నేనూ ఫ్రెండ్స్ అని చెబుతున్న భర్తను వారిస్తున్నట్లుగా, ఆ సంగతులన్నీ నాకు తెలుసును, అర్జునన్నయ్య రాగానే నాకు అన్ని విషయాలు చెప్పారని చెప్పింది గీత.

భార్య అలా అనగానే కొంచెం చిన్నబుచ్చుకున్న కృష్ణ అంతలోనే మళ్ళీ, సరేలేరా, ఇక్కడే ఉండు నేను రిఫ్రెషయి వస్తానని లోపలకు వెళ్ళిపోయాడు. గీతా స్నానానికి నీళ్ళు పెట్టని చెప్పి, అర్జున్ రాకకు గల కారణాలను ఆలోచించే పనిలో పడ్డాడు. కాసేపటికి నీళ్ళను పెట్టానని వచ్చి చెప్పిన గీత, దీర్ఘంగా ఆలోచిస్తున్న అతన్ని చూసి, 'ఏంటండి? అంతలా ఆలోచిస్తున్నారు?' అని అడగ్గానే, ఏమీలేదని చెప్పి లేచి స్నానం చేసి వచ్చాడు.

అర్జున్ని చూసిందగ్గర్నుండీ తన భర్త లో వచ్చిన మార్పును గమనిస్తున్న గీత, ఇక ఉండ పట్టలేక, విషయమేమిటని భర్తను అడిగే ప్రయత్నం చేసి, తనకు చేప్పేటంత విషయమైతే తప్పకుండా చెబుతాడు కదా! అని ఆప్రయత్నాన్ని విరమించుకుంది. ఇంకేంటిరా విషయాలు? అంటూ అర్జున్ తో మాట్లాడుతున్న భర్తలో, ముందుండే ఉత్సాహం కానీ, చురుకుదనం కానీ కనిపించకపోవడాన్ని కూడా గీత గమనిస్తూనే ఉంది . డిగ్రీ వరకూ కలసి చదువుకున్న ఫ్రెండ్, చాలా రోజుల

తర్వాత కనిపిస్తే ఈయన్నేంటి ఇలా ఉన్నారని , అర్జున్ని చూస్తే మంచి వాడిలాగానే కనిపిస్తున్నడే? తెగ ఆలోచిస్తోంది గీత.

ఇలా ఉండగానే, ఏమోయ్ గీత! అన్న పిలుపు వినపడగానే, ఒక్క ఉదుటన హాల్లోకి వెళ్ళిన ఆమెను, అర్జున్ కి పరచయం చేయబోయాడు కృష్ణ "మా పరిచయలు అయిపొయాయిరా! మీ అబ్బాయిని కూడా పలకరించేశాను". నీ పేరు అడిగిన నన్ను చాలా వింతగా చూసి, ఒక పట్టాన ఇంట్లోకి రానీయ్యని గీత తెలివితేటలు అమోఘం. మన కాలేజీ ఫేర్‌వెల్ పార్టీలో తీయించుకున్న ఫొటోలో నిన్ను, నన్ను చూపిస్తేనే గానీ లోపలకు రానియ్యలేదు. మొత్తానికి నువ్వు చలా లక్కీ ఫెలోవిరా!" అని పొగుడుతున్న అర్జున్ మాటకు అడ్డుతగులుతూ, దానిదేం ఉందిగానీ ఇంతకీ ఇప్పుడేం చేస్తున్నావ్ అని సూటిగా ప్రశ్నించాడు కృష్ణ

"మన డిగ్రీ అయిపోయాక, మీరందరూ పి.జీ.ల్లో జాయినైపోయారు. అయితే డిగ్రీ ఎగ్జామ్స్‌లో స్లిప్ పెట్టాననే కారణంతో నీ సిన్సియార్టీతో నన్ను స్క్వాడ్‌కి పట్టించావు గుర్తుందా?" అన్న అర్జున్ మాటలకు తలదించుకుని కృష్ణ, సారీరా, 'అప్పుడేదో తెలియక, చిన్న తనంలో అలా చేసేనే గానీ, నువ్వంటే పడకకాదురా" అని చెబుతున్న అతనితో, "సరేలేరా అప్పుడు నన్ను ఒక సంవత్సరం డిబార్ చేశారు. ఆ తర్వాత ఏదో రకంగా డిగ్రీ పాసై, మా నాన్న గారి ప్రోత్సాహంతో ఫారెన్ వెళ్ళి అక్కడే చదివి, చిన్న బిజినెస్ స్టార్ట్ చేశాను. అక్కడ మంచి లాభాలు రావడంతో బాగా సంపాదించాను. చాలా సంవత్సరాల తర్వాత మన దేశం రావాలనిపించి వచ్చాక, నాకెందుకో ఇక్కడే బిజినెస్ స్టార్ట్ చేయాలనిపించింది. ఇప్పుడా పనిమీదనే ఉన్నాను. ఎలాగో ఫ్రెండ్స్‌ని కలసి చాలా రోజులయ్యిందని, ఇలా వచ్చానంతే" నని తన కథను చెప్పాడు అర్జున్.

అన్నట్టు, నువ్వు కూడా జాబ్ మారడానికి చూస్తున్నట్లుగా, గీత మాటల్లో తెలుసుకున్నాను. అయినా నువ్వు మరీ మొండితనంగా ఉన్నట్లనిపిస్తోందిరా! నువ్వు మాత్రం ఏమీ మారలేదు. అదే వ్యక్తిత్వం, అదే సిన్సియారిటీ. అయినా నువ్వు నాలా కాదు కదరా! చిన్నప్పటి నుండి చూస్తూనే ఉన్నాను కదా! అన్నీ ఫస్ట్ క్లాసులే కదా! ఏ తెలివితేటలు లేని నేనే ఈ పోజిషన్ లో ఉన్నానంటే, అమోఘమైన తెలివితేటలున్న వాడివి నువ్వు నాకంటే మంచి పొజిషన్లో ఉంటావని ఊహించాను. కానీ, నీ మొండితనం, సిన్సియార్టీ అంటూ, చూడు ఎలా తయారయ్యావో? నేను బిజినెస్ స్టార్ట్ చేస్తున్నాను కదా, నాకూ ఎలాగూ ఒక పార్ట్నర్ కావాలి, ఆ పార్ట్నర్ నువ్వే ఎందుకు కాకూడదు? నీదగ్గర తెలివుంది, నా దగ్గర డబ్బుంది, ఇద్దరం కలిసే బిజినెస్ స్టార్ట్ చేద్దాం, ఏమంటావ్?"

నువ్వు పైసాకూడా పెట్టుబడిపెట్టనక్కర్లేదు. కానీ నీ తెలివితేటలు ఉపయోగిస్తే చాలు. నీకెంత జీతం కావాలో అంత తీసుకో, ఇక్కడ ఒక్క దగ్గరే కాకుండా మనమిద్దరం ఫారెన్ లో కూడా బిజినెస్ చేద్దాం. అసలిన్నాళ్ళూ నువ్వెక్కడున్నావో తెలియక నానా పాట్లూ పడ్డాను" అని అంటున్న అర్జున్ మాటలు వింటున్న గీత ఆనందానికి అవధులు లేవు. కానీ ఏం మాట్లాడకుండా ఆలోచిస్తున్న భర్త వైపు కోపంగా చూస్తోందామె. మళ్ళీ అర్జునే మాట్లాడుతూ, నీకు కృష్ణ అనే పేరు మాత్రమేపెట్టారు కానీ నీ గుణగణాలు, శక్తి సామర్థ్యాలు నాకు బాగా తెలుసు. కృష్ణుని పేరు పెట్టుకున్న రాముడివన్న నమ్మకం నాకు ఉంది. ఆ నమ్మకంతోనే, కావస్తే నా కంపెనీ పవర్ ఆఫ్ పట్టా రాసిస్తాను. ఇంకా నా మీద నమ్మకం కుదరకపోతే నేనేం చెయ్యాలో చెప్పు చేస్తాను. ఎందుకంటే స్నేహం కోసం ఏమైనా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇక నీ ఇష్టం" అని అన్నాడు.

ఏమండీ! అంత మంచి ఆఫర్ యిస్తుంటే, ఒప్పుకోకుండా ఇలా ఆలోచిస్తారేంటండి? ఒప్పుకోండి" అని గీత ఒక పక్క చెబుతున్నా కూడా ఇంకా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు కృష్ణ. పావుగంట వరకూ నిశ్శబ్దం ఆవరించిందక్కడ. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ గొంతు సరిజేసుకున్నాడు కృష్ణ. "నాకొంచెం టైం కావాలి రా" అని అర్జున్‌తో అనగానే, సరేరా... టేక్ యువర్ ఓన్ టైం! ఇదిగో నా విజిటింగ్‌కార్డ్. నువ్వే ఫోన్ చెయ్యి. ఇందులో బలవంతమేమీ లేదు. సరేనా! ఇక వెళ్ళొస్తానురా, వస్తానమ్మా!!" అని చెప్పి చకచక కారు దగ్గరికి వెళ్ళి, డోర్ తీసి పట్టుకొని, నువ్వు - నేను కలిస్తేనే మంచిదనిపిస్తోందిరా! డిగ్రీలో నిన్ను ఏడిపించేవాడినని, నన్ను దుర్మార్గుడని అని ఆలోచించకు. అదేదో చిలిపితనం, చిన్నవయసు అంతే, మరిక ఉంటాను" అంటూ కారెక్కి వెళ్ళిపోయాడు.

8 గంటలు ఆఫీసులో పని చేసి, యింటికి రాగానే , ఇదంతా జరిగేసరికి కృష్ణ కు తలనొప్పి స్టార్టయింది. బుర్రంతా వేడెక్కిపోయింది. గీతా! అని కేక వేసి వేడిగా కాఫీ తెమ్మన్నాడు. "ఏంటండీ అంతలా ఆలోచిస్తున్నారు?" అంటూ కాఫీ చేతికి అందిస్తూ అడిగింది గీత". ఏమిలేదు,నేను డిగ్రీ పాసై 15 (పదిహేను) సంవత్సరాలయ్యాయి. ఇన్ని సంవత్సరాల్లో దాదాపు నా ఫ్రెండ్స్ అందరితోనూ నాకు అటాచ్మెంట్స్ ఉన్నాయి. అయితే వీడు నేను ఇంటర్, డిగ్రీ కలసి మొత్తం అయిదు సంవత్సరాలు చదువుకున్నాం. కానీ ఆ 5 సంవత్సరాలు ఒకరంటే ఒకరికిపడేది కాదు. ఎప్పుడూ దుడుకుగా ఉండేవాడు.అమ్మాయిలను ఏడిపించేవాడు. లెక్చరర్లను కామెంట్ చెసేవాడు. ఇంకా చాలా అల్లరి చేసేవాడు. వీడితో మాట్లాడాలంటేనే నాకు అదోలా ఉండేది. ఆఖరికి ఎగ్జామ్స్ లో స్లిప్పులు పెడితే సహించలేక కంప్లేంట్ చేశాను.

దాని వలన వాడికి నామీద కక్ష , పగ ఉండి ఉంటాయనుకున్నాను. ఆ తర్వాత ఇన్ని సంవత్సరాలు ఏమయ్యాడో, నాకే కాదు, మా ఫ్రెండ్స్ ఎవరికీ తెలియదనే వాళ్ళు.

చాలా సంవత్సరాల తర్వాత వచ్చి, పార్టనర్ అవుదామంటున్నాడు, అందుకని వీడిని ఎంత వరకూ నమ్మవచ్చోనని ఆలోచిస్తున్నాను. ఒకవేళ నా మీద పగ సాధించడానికి వచ్చి, నాకిప్పుడున్న ఉపాధి కూడా పోగొట్టాలని చూస్తున్నాడేమోనని అనిపిస్తోంది." అని కృష్ణ అనగానే , దీనికంత ఆలోచన దేనికండీ? అవన్నీ చిన్ననాటి అల్లర్లు, వాటిని మరచిపోమని చెప్పి వెళ్ళాడు కదా! అయినా మీరు మరీనండి! ఎప్పుడో 15 సంవత్సరాల క్రితం, అదీ తెలిసీ తెలియని వయసులో చదువుకునే రోజుల్లో జరిగిన వన్నీ గుర్తుంటాయా?? అన్నీ గుర్తుపెట్టుకుని మరీ మీ మీద పగ సాధించడానికి వెతుకుంటూ వస్తాడా? అలాంటి ఆలోచనల్ని పక్కనబెట్టి ఆయనతో కలసి బిజినెస్ చేస్తేనే మంచిదనిపిసోంది. కోరి ఇంటికొచ్చిన అవకాశాన్ని విడిచి పెట్టకండీ!" అని భర్తకు హితోక్తులు చెప్పింది.

"నీ మాటల్లో కూడా కొంత వరకు నిజం ఉందనిపిస్తోంది. కానీ, వాడు చెప్పింది ఎంత వరకు నిజమో తెలియకుండా, చేస్తున్న జాబ్ వదిలి వెళ్ళిపోవడం మంచిది కాదేమోనని నా ఆలోచన" అన్న భర్త మాటలు పూర్తి కాకుండానే మీరింకేమీ ఆలోచించకుండా అతనికి ఫోన్ చేసి ఒ.కె చెప్పేయండి" అని ఖరాఖండిగా చెప్పేసింది గీత. అప్పటికే రాత్రి మించిపోవడంతో సరే చూద్దాంలే నని ముక్తసరిగా చెప్పి నిద్రకుపక్రమించారు. చేస్తున్న ఉద్యోగం మారిపోతే ఎలాననే తలంపు తో కృష్ణకు ఆయన ఉద్యోగం మారిపోతే బాగుండుననే ఆలోచనలలతో గీతకు చాలా సేపటివరకూ నిద్ర పట్టలేదా రాత్రి. ఉయ్యాల్లో బాబు పాలకోసం ఏడవగానే గీత లేచి బాబును ఎత్తుకోగానే, బాబు గురించి భవిష్యదాలోచనలు ఒక్కసారిగా కృష్ణ మనసులో మెదిలాయి. అంతే, ఎన్నాళ్ల నుంచో చేస్తున్నా ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం వదిలేద్దామనే నిర్ణయం తీసుకుని నిద్రపోయాడు.

మరుసటి రోజు ఉదయాన్నే అర్జున్ నెంబర్‌కు కాల్ చేసి, నీతో బిజినెస్ చేయడం కన్నా, నీ దగ్గర చేస్తేనే నాకు బాగుంటుందని చెప్పేశాడు కృష్ణ. దట్స్ గుడ్. పోనీలేరా ఏదోరకంగా నాకు దగ్గరౌతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందని అర్జున్ చెప్పి ఫోన్ కట్ చేశాడు. తానంతవరకూ పని చేసిన జి.కె గ్రూప్ ఆఫ్ కంపెనీకు ఆ రోజే రిజిగ్నేషన్ పంపించి, తన రెజ్యూమోతో సహా అర్జున్ దగ్గరకు వెళ్ళాడు. కృష్ణను చూస్తూనే నేరుగా తన ఛాంబర్‌లోకి ఆహ్వానించాడు. బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ లో అపార అనుభవమున్న కృష్ణను తన స్టాఫ్ అందరికీ పరిచయం చేస్తూ, ఈ రోజు నుండి ఈయన కూడా ఇక్కడే వర్క్ చేస్తారు. మీకు నేను ఎలాగో, ఈయన కూడా

అలాగే నన్నుమాట. అంటే నాలాగే ఇతనుకూడా బాసంటూ స్టాఫ్ అందరికీ చెప్పాడు. పరిచయాలైపోయాక ఎవరి ఛాంబర్లకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఎం.డి. ఛాంబర్లో కూర్చున్న అర్జున్ కెదురుగా కూర్చొని ఉన్న కృష్ణకు, తన బిజినెస్ వివరాలన్నీ ఒక్కొక్కటిగా చెప్పుకొచ్చాడు. అంతా విన్నాక, సో నీ మేజర్ బిజినెస్ కనస్ట్రక్షన్ అన్న మాట", అని ఆలోచనలో పడ్డాడు కృష్ణ "ఇంకా నీ అంటా వేంట్రా? ఇది మన బిజినెస్. 'ఎ.కె. గ్రూప్ ఆఫ్ కంపెనీస్' అంటే 'అర్జున్ కుమార్' గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అనా? అని కృష్ణ అడగ్గానే, కాదు, అర్జున్-కృష్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్. ఇకపోతే నీ జీతం నువ్వు పాతకంపెనీలో డ్రా చేసిన దానికి డబులుంటుంది. ఇదిగో ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ తాళాలు, రోజూ ఇంటికి కారొస్తుంది. అందులోనే ఆఫీసుకు రావడం, వెళ్ళడం. ఇక నా బిజినెస్ లోకి నిన్ను సాదరంగా స్వాగతిస్తున్నాను." అంటున్న అర్జున్ మాటలకు ఆనందం ఉబికి వస్తున్నాకూడా ఇప్పుడెందుకురా ఇవన్నీ అని అనకుండా ఉండలేకపోయాడు. సరే అభిమానంగా ఇస్తున్నావు కానీ, ఫ్రీ గా ఉండడానికి నాకు గిల్టీగా ఉంటుంది' అన్నాడు కృష్ణ. సరే ఎంతో కొంత నామినల్‌గా పే చేయచ్చులే. అది కూడా నీ యిష్టమే" అని చాలా కూల్ గా చెప్పాడర్జున్.

చివరిగా ఒక్కమాట. ఎలాగూ నాతో కలసే ఉంటావు కదా! ఇదిగో ఈ పేపర్లను చూసి చిన్న సంతకం పెట్టెస్తే ఇక మనం పని ప్రారంభించవచ్చు" అని అర్జున్ అనగానే ఏంట్రా ఆ పేపర్లని తీసుకుని చదివాడు కృష్ణ. మొత్తం చదివాక, అంటే 5 సంవత్సరాలు ఎగ్రిమెంట్ అన్నమాట. ఇంతకీ ఎందుకురా ఇది? అని అడిగేలోపలే, ఏం లేదురా మన మధ్యస్నేహం ఎప్పుడూ ఇలాగే ఉంటుందో, ఉండదో తెలియదు కదా! అయినా బిజినెస్ అన్నాక ఇదంతా కామనే కదా! నీకు తెలియనిదేముంది? అని సమాధానమిచ్చాడు అర్జున్. మంచి జీతం, మంచి వసతులు, అన్నింటినీ మించి మంచి హోదా కల్పిస్తున్న స్నేహితుడనే నమ్మకంతో సంతకం పెట్టాడు కృష్ణ.

ఈ 5 సంవత్సరాల్లోనూ నేను పెట్టుబడి పెట్టడమే తప్పా లాభాలొచ్చినా, నష్టాలొచ్చినా నేనేమీ అడగను. 5వ సంవత్సరంలో చూసుకుందాం. లాభమొస్తే ఇద్దరం సమానంగా పంచుకుందాం, ఒకవేళ నష్టమొస్తే నేనొక్కడినే భరిస్తాను. ఆ తర్వాత నువ్వు ఎక్కడికైనా వెళ్ళిపోవచ్చు. అది నీ ఇష్టం" అన్న అర్జున్ మాటలకు సమాధానంగా ఏదో అనబోతున్న కృష్ణను వారించి ఇక ఏమీ మాట్లాడకు, ఇదే ఫైనల్, పద భోజనం చేద్దాం' అనగానే ఏంటి? భోజనం కూడా ఇక్కడేనా? అంటూ తెగ మురిసిపోయాడు. సాయంత్రం వరకూ ఏదో మాట్లాడీ ఇంటికి వెళ్ళేసరికే సామాన్లన్నీ పేక్ చేస్తున్నారు.

దూరం నుండే కృష్ణను చూస్తూనే గీత ఆనంద పడుతూ, ఏమండీ ఇన్నాళ్ళకు మీరనుకున్నహోదాకు చేరుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉందండి... అంటూ ఆ బండి మీదనే కొత్త ఫ్లాట్‌కు చేరుకున్నారు.

మరుసటి రోజు పొద్దున్నే 9 గంటలకే ఆఫీసుకు వచ్చిన కృష్ణ సిన్సియార్టీని మెచ్చుకుంటూనే, ఇక ఈ ఆఫీసు బాధ్యతలు నీ చేతిలో పెడుతున్నానన్న అర్జున్‌కి థాంక్స్ చెప్పి, వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. ఇంకా అప్పుడే స్టార్టవుతున్న ఆఫీసు కాబట్టి చాలాతక్కువమందే స్టాఫ్ ఉన్నారు. ఉన్న ఆ కొద్ది మందితోనే పని ప్రారంభించాడు కృష్ణ. కనస్ట్రక్షన్ బిజినెస్ కాబట్టి, టెండర్లు వ్యవహారాలు చూసుకునే బాధ్యత కూడా అతనికే అప్పజెప్పాడర్జున్. ఏ పనైనా చాలా సులువుగా, చాకచక్యంగా చేస్తున్న కృష్ణను చూసి మొదట్లోనే స్టాఫందరూ మెచ్చుకున్నారు.

ఆరు నెలలు గడిచేసరికల్లా, కృష్ణ వర్క్‌లో బిజీ అయిపోయాడు. స్టాఫందరూ కూడా కష్టపడి పని చేస్తున్నారు. ఇంటికి రావడం కూడా లేటవుతోంది. గీతతో మాట్లాడే తీరిక కూడా లేకుండా పోతోంది. వసంత్ ను ఎత్తుకుని ముద్దులాడడానికి కూడా టైం లేనంతగా మారిపోయాడు. ఎలాగూ లంచ్ ఆఫీసులోనే కనుక సాయంత్రం 6 గంటలకు ఇంటికొచ్చేవాడు. రానురానూ రాత్రి 7 గంటలు దాటేది. ఇంటికొచ్చినా కూడా ఆఫీసు ఫోన్లే. ఎప్పుడూ టెండర్లూ, కొత్త ప్రాజెక్టులంటూనే తిరిగేవాడు. 10మంది స్టాఫ్‌తో ప్రారంభించిన ఆఫీసు 30మందికి చేరుకుంది. ఆ తర్వాత 50 మందయ్యారు. ఆఫీసులో అందరికీ కృష్ణ ఎంత చెబితే అంత. ఎదురు చెప్పేవారు కాదు. మూరు మూల మేడ మీద అద్దె రూంలో స్టార్టయిన ఆఫీసు కాస్తా.. విశాల మైన పెద్ద బిల్డింగ్ లోకి మార్చారు. కొత్త బిల్డింగ్‌లోకి మారిన దగ్గర్నుండీ అతనికి బాధ్యతలు పెరిగాయి. స్టాఫ్ కూడా పెరిగారు. అయితే ప్రతి చిన్న దానికి అర్జున్ దగ్గరకి వెళ్ళాల్సి రావడం, చెక్ మీద సంతకాలు పెట్టడానికి అర్జున్ దొరక్కపోవడంతో, చిన్న చిన్న టెండర్లు మిస్సయ్యేవి. ఇది గమనించిన అర్జున్ కృష్ణకు చెక్ పవరిచ్చాడు. అంత చనువిచ్చినా దాన్నెప్పుడూ కూడా తన స్వార్థానికి వాడుకోలేదతను. అతని సిన్సియార్టీతో. ఎ.కె. గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సంవత్సరం తిరిగే సరికే కనస్ట్రక్షన్ రంగంలో నెంబర్- 1 గా ఉన్న జి.కె. గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కి ప్రధాన పోటీదారుగా తయారు చేశాడు.

స్నేహితుని పని తనాన్ని పక్కనే ఉండీ గమనిస్తున్న అర్జున్, అతనికొక 'విల్లా' ను కేటాయించాడు. నాకెందుకిప్పుడని కృష్ణ చెబుతున్నా వినిపించుకోకుండా దగ్గరుండీ వాళ్ళను విల్లా లోకి మార్చేశాడు అర్జున్. కృష్ణకున్న బాధ్యతలు పెరుగుతున్న కొలది రోజు రోజుకు తమ నుండి భర్త దూరమయిపోతున్నాడనే దిగులు, గీతలో పెరిగిపోతోంది. ఇంటి నుండి ఫోన్ చేసినా ఎత్తే స్థితిలో కృష్ణ ఉండేవాడు కాదు.

ఇంకొన్ని రోజులకే వాళ్ళ కంపెనీ నెంబర్ -1 పొజీషన్‌కు చేరుకుంది. కృష్ణ ఆనందానికి అవధులే లేవు. ఇప్పుడు అతను ఇంటికి వెళ్ళడం రాత్రి 11 దాటుతోంది. భర్త కోసం చూసి చూసి గీత నిద్ర పోయేది. బాబును చూడడానికే టైం సరిపోయేది కాదు. పొద్దున్నే ఆరు గంటలకే ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. రెండు పూటలా అక్కడే! గీత చేతి వంట తిని ఎన్నిరోజులయ్యిందో?

కొన్ని రోజులు ఆఫీసుకు దూరంగా ఉండి, గీతను తీసుకుని ఎటైనా వెళ్ళమని అర్జున్ అన్నాకూడా, మనమిప్పుడే కదా నెంబర్ -1 కి వచ్చాం.దీన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. ఇంకొన్ని రోజులు పోనీలే అని దాటవేశాడు. తన చేతిలో ఎన్ని కోట్ల డబ్బులున్నా కూడా అదంతా పరాయి వాళ్ళ డబ్బని మాత్రమే చూసేవాడు. ఎలాగూ ఇందులో నెంబర్ -1 కాబట్టి, కొత్త బిజినెస్ స్టార్ట్ చేద్దామనగానే అర్జున్ కూడా ఒ.కె. అనడంతో టెక్స్ టైల్స్ లోకి అడుగు పెట్టారు. ఇందులో మోసాలు జరిగే అవకాశం ఉంది గనుక ప్రతి విషయాన్ని కృష్ణే దగ్గరుండీ చూసుకునేవాడు. క్యాంపులకు వెళ్ళేవాడు. రానురానూ స్టాక్ ను తెచ్చుకోవడానికి, మిగిలిన పనులకు ఫారెన్ వెళ్ళి రావాల్సి వచ్చేది. ఒక్కొక్క సారి రెండువారాల పైనే ఉండిపోయే వాడు. గీతతో మాట్లాడటానికి గానీ వసంత్ తో ఆడుకోడానికి గానీ అస్సలు టైం దొరికేది కాదతనికి. ఎంతసేపూ బిజినెస్,బిజినెస్.

'చక్కగా సాయంత్రం 5 గంటలకు ఇంటికొచ్చేసే ఉద్యోగం నుండి అనవసరంగా మారమని చెప్పానురా బాబు' అని గీత అనుకోని రోజులేదు. తండ్రి సంరక్షణ లేకుండా పెరుగుతున్నాడు వసంత్. ఇంటి నిండా పని మనుషులు ఉన్నారు కదా! వారు చూసుకుంటారులే అన్న ధీమాతో ఉన్నాడు కృష్ణ. ఏ బిజినెస్‌స్టార్ట్ చేసినాకూడా నెంబర్ -1 స్థానానికి ఎదిగిపోయేది ఎ.కె. గ్రూప్ వాళ్ళు కొత్త బిజినెస్ స్టార్ట్ చేస్తున్నారని తెలియగానే, మిగిలిన వారి గుండెలు వేగం పెరిగేవి. ఇలా నాలుగు సంవత్సరాలు తిరేగే సరికి ఎక్కడెక్కడ ఏ ఏ ఆస్తులున్నాయో, ఏ ఏ బిజినెస్‌లున్నాయో అర్జున్ కే తెలియనంతగా అభివృద్ధి చేశాడు కృష్ణ. అయితే అంతా మాత్రం అర్జున్ పేరు మీదనే ఉండేది. మధ్య మధ్యలో అప్పుడప్పుడూ, ఇంత డబ్బున్నప్పుడే మనం బాగుపడాలని గీత ఎన్ని సార్లు చెప్పినా, ఇదంతా ఫ్రెండ్ సొమ్మే కానీ మనది కాదని, "నన్ను పూర్తిగా నమ్మి బాధ్యతలు అప్పజెప్పిన నా స్నేహితున్ని నేను మోసం చేయలేనని" చెప్పేవాడు కృష్ణ. బంధువులతోకానీ, ఫ్రెండ్స్‌తోగానీ మాట్లాడే తీరికలేకుండా ఉండే వాడతను. జ్వరమొచ్చినా, దగ్గొచ్చినా, డాక్టరెప్పుడూ అందుబాటులోనే ఉండే వాడు.

ఒకరోజు మధ్యాహ్నం గీత నుండి ఫోనొచ్చిందంటూ పి.ఏ. తెచ్చి ఫోనివ్వగానే, "నేను మీటింగ్‌లో ఉన్నానని చెప్పేలోపలే, వసంత్ కిందపడిపోయాడని, ముక్కులోంచి రక్తం రావడంతో, హాస్పటల్ కు తీసుకువెళ్ళేనని , అన్ని టెస్టుచేసి, "లుకేమియా" అంటున్నారుఅని గీత ఏడుస్తూ చెప్పింది. అంతే వెంటనే మీటింగ్ కాన్సిల్ చేసి, హాస్పటల్ కు వెళ్ళాడు. డాక్టర్లతో మాట్లాడగానే, " మీరు చాలా లేట్ చేశారు మిస్టర్ కృష్ణ, బాబుని పూర్తిగా పట్టించుకోలేదనుకుంటాను. ఇప్పుడు పూర్తిగా ముదిరిపోయిందని డాక్టర్లు చెప్పగానే ఎంత డబ్బైనా ఫర్వాలేదని కృష్ణ ప్రాధేయపడ్డాడు.

మొత్తానికి ఫారెన్ నుండి స్పెషలిస్ట్ లను తెప్పించి వసంత్ కు ట్రీట్ మెంట్ చేయించారు. బాబు ఆరోగ్యం కుదుటపడింది. కానీ తనను, బిడ్డను పట్టించుకోలేదని, గీత అలిగి పుట్టింటికి వెళ్ళిపోయింది. "నా దగ్గర డబ్బుంది కాబట్టి అంత కాస్ట్లీ ట్రీట్ మెంట్ ఇప్పించ గలిగాను. కానీ అంత డబ్బులేని వాళ్ళ పరిస్థితి ఏమిటని?" కృష్ణ ఆలోచనలో పడ్డాడు. మనమే ఒక హాస్పటల్ కట్టించి, ఇలాంటి వాటికి చాలా తక్కువ ఖర్చుకే వైద్యమందించాలనే తలంపు వచ్చిందతనికి. అంతే! ఆలోచన వచ్చిందే తడవుగా ఆఫీసుకు వెళ్ళి, ఈ విషయం గురించి స్టాఫ్ తో మాట్లాడాడు. అందరూ చాలా సంతోషించారు. చాలా మంచి ఆలోచన అని ప్రతి ఒక్కరూ అతన్ని మెచ్చుకున్నారు. అయితే అంత హాస్పటల్ అంటే చాలా ఖర్చు అవుతుందని కొందరు చెప్పారు.

ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదని కృష్ణ అనడంతో అందరూ చప్పట్లు కొట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అతనికి కూడా చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రాజెక్ట్ ఒక్కటే మనం బిజినెస్ మైండ్ తో కాకుండా చేస్తున్నందుకు నాకు ఆనందంగా ఉందని స్టాఫ్ అందరితో చెప్పాడు. ఆ ఆఫీసులో అందరికన్నా ముందు నుండి పని చేస్తున్న రామారావు మాత్రం, "అర్జున్ గారికొకసారి చెప్పమని" సలహా యిచ్చాడు. "అర్జున్ ఇప్పుడు యు.ఎస్.ఏ.లో ఉన్నాడు కదా, అయినా ఏ ప్రాజెక్ట్ ప్రారంభించినా తన్తో చెప్పక్కరలేదని ముందే చెప్పాడు. వాడు నా ఫ్రెండే కదా! వాడు అటునుంది వచ్చాక వివరంగా అన్నీ నేనే చెబుతాను" అని కృష్ణ అనడంతో ఎవరెవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమైపోయరు. ఎలాగైనా సరే ఆప్రాజెక్ట్‌ను తొందరగా ప్రారంభించి, పూర్తి చేయాలనే తపనతో అతనున్నాడు. హాస్పటల్ నిర్మాణానికి కావాల్సిన స్థలం సేకరించారు. మంచి పొజిషన్‌లో ఉన్నాడు కాబట్టి తన ఇన్‌ఫ్లూయెన్స్ ఉపయోగించి పర్మిషన్ తెప్పించాడు. మంచి రోజు చూసి ఇక శంకు స్థాపన చేయడమే మిగిలింది. హాస్పటల్ కు కావాల్సిన ఎక్విప్ మెంట్ కు ఎడ్వాన్స్ గా చెక్ పంపించేశాడు కృష్ణ. ఆ ప్రాజెక్ట్ పూర్తయితే పది మందికి ఉపయోగపడుతున్నాననే ఆనందంలో కూడా "గీత" గురించిన ఆలోచనే రాలేదతనికి.

సరిగ్గా మూడో రోజున యు.ఎస్.ఏ.నుండి అర్జున్ వచ్చేశాడు. ప్రతి రోజూ లాగానే ఆరోజు కూడా ఉదయాన్నే 7 గంటలకే ఆఫీసుకు వెళ్ళి, ఏవో పనుల్లో బిజీగా ఉన్న కృష్ణ దగ్గరకు పి.ఏ. వచ్చి ఒక చెక్‌ను చూపిస్తూ, "సర్ మీరు ఆ ఎక్విప్మెంట్ ఏజెన్సీకి ఇష్యూ చేసిన చెక్ చెల్లదని బ్యాంక్ వాళ్ళు రెఫ్యూజ్ చేశారట" అని చెప్పాడు. "వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? నేనిచ్చిన చెక్ చెల్లక పోవడమేమిటి? ఎకౌంట్ లో చాలా డబ్బుంది కదా!! అని కృష్ణ అంటుండగానే , ఎకౌంట్‌లో డబ్బుల్లేక కాదట సార్, చెక్ వెనక్కి పంపింది' అని పి.ఏ. అనగానే, "ఎకౌంట్లో డబ్బుండీ కూడా చెక్ రిటనొచ్చిందా?? కారణం దేనికట" అని రెట్టించిన గొంతుతో కృష్ణ అడుగుతుంటే, "సంతకం మారిందట సర్" అని సమాధానమిచ్చాడు పి.ఏ.

'వాట్? సిగ్నేచర్ మారిందా? ఏదీ ఇలా ఇవ్వు" అని చూసి, ఇది నా సైనే కదా! ఎక్కడా తేడా లేదు కదా! ఏమయింది? ఎందుకు రిటనొచ్చింది?" అనుకుంటూ వెంటనే బ్యాంక్ కు ఫోన్ చేశాడు. ఒక సారి బ్యాంక్ కు వచ్చి మాట్లాడమని రెక్లెస్‌గా సమాధానం చెప్పి ఫోన్ పెట్టేసిన మేనేజర్ మీద విపరీతమైన కోపమొచ్చిందతనికి. నిన్నటి దాకా చాలా వినయంగా, ఉన్న బ్యాంక్ మేనేజర్‌కేమయ్యింది? అని అనుకొని వెంటనే బ్యాంక్ కి వెళ్ళాడు. తిన్నగా మేనేజర్ దగ్గరకు వెళ్ళి విషయమేమిటని అడిగాడు. ఎప్పుడు కృష్ణ వచ్చినా లేచి నుంచొని మరీ విష్ చేసే మేనేజర్, తన రూం లోకి వెళ్ళినా కనీసం కూర్చోమని కూడా అనకపోవడంతో కోపమొచ్చి, సిగ్నేచర్ గురించి గట్టిగా అడగగానే, "మీకు చెక్ పవర్ లేదని, మీ హెడ్ ఆఫీస్ నుండి మాకు లెటరొచ్చింది" అంటూ చూపించాడు. అదేంటని ఆశ్చర్యపోతూ, ఆ లెటర్ తీసి చూశాడు. తనకు చెక్ పవర్ తీసేస్తున్నట్లు స్వయంగా అర్జునే పంపించాడు. ముందు నమ్మక పోయినా బ్యాంక్ మేనేజర్ స్వయంగా చెప్పడంతో సరేనని అటునుండటే అర్జున్ బంగ్లాకు వెళ్ళాడు.

తిన్నగా అర్జున్ రూం లోకి వెళ్ళే ప్రయత్నం చేసిన కృష్ణను అక్కడి పనివారడ్డుకున్నారు. "రేయ్ వచ్చిందెవరనుకున్నార్రా? నేన్రా కృష్ణనని చెప్పినా సరే, సార్ బిజిగా ఉన్నారని, కాసేపాగాలని అక్కడే ఆపేసారతన్ని. చేసేదిలేక అక్కడే ఉండి పోయాడు. కాసేపయ్యాక, అర్జున్ రమ్మనడంతో అతని రూంలోకి వెళ్తూనే, ఏంట్రా ఇది? ఎప్పుడూ లేని అడ్డంకులేంటి? అని ప్రశ్నలు వేసుకుంటూ వెళ్ళిపోతున్న కృష్ణ వైపు చూసి, ఓ నవ్వు నవ్వాడు అర్జున్. నాకు చెక్ పవర్ పోవడమేమిటి? అని సూటిగా ప్రశ్నించాడు కృష్ణ. అవేమీ పట్టనట్టుగా కూల్‌గా ఉన్న అర్జున్ చూస్తుంటే కృష్ణకు కోపం అంతకంతకు పెరిగిపోతోంది. 'నాకొచ్చిన కోపానికి, ఎదురుగుండా

ఉన్నది నువ్వు కాకపోతే, ఏంచేసే వాడ్నోనని ఊగిపోతున్న' కృష్ణను చూస్తూనే ఏంచేస్తావ్? అని అర్జునడిగాడు.

సరే! ఇన్ని మాటలెందుకుగానీ, అసలు ఏం చేద్దాం అనుకుంటున్నావ్? అని కృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, అదే గదిలో ఉన్న టేబుల్ డ్రాయర్ లోంచి పేపర్లను తీసి, ఇవేంటో తెలుసా? అని అతనికి చూపించాడు అర్జున్. ఇవి మన ఎగ్రిమెంట్ పేపర్లు. ఈ ఎగ్రిమెంట్ ప్రకారం, మూడు రోజుల క్రితమే 5 సంవత్సరాల ఎగ్రిమెంట్ అయిపోయింది. సో, మూడు రోజుల క్రితమే ఆటోమెటిగ్గా నా పార్ట్నర్ గా నీకున్న అన్ని పవర్స్ పోయాయి. ఒకవేళ నీకేదైనా జాబ్‌కావాల్సి వస్తే నా దగ్గర ఖాళీ ఉంటే నేనే చెప్తాన్లే" అని మాట్లాడుతున్న అర్జున్ వైపే చూస్తూ నిలబడిపోయాడు కృష్ణ, అదేంట్రా? మన ఫ్రెండ్ షిప్పో మరి? అన్న మాటకు "స్నేహం స్నేహమే, బిజినెస్ బిజినెస్సే అని నువ్వే కదా చెప్పావు మరచిపోయావా?" అని అంటున్న అర్జున్ మాటలకు గుండాగిపోయినట్లైంది కృష్ణకు.

"హాస్పటల్ గురించి చెప్పలేదనే కోపమేమైనా వచ్చిందా?"అని కృష్ణ అంటుండగానే, "అయినా నా డబ్బుతో నిన్ను బిజినెస్ చెయ్యమన్నాను కానీ, ఇలా కోట్లు నువ్వు సేవలంటూ మొదలుపెడితే, నే నేమయిపోవాల్రా? అని అర్జునడిగాడు. సరేలే! పోనీ నీ ఎగ్రిమెంట్ ప్రకారమే 5 సంవత్సరాల తర్వాత లాభమొచ్చిందిగా, అందులో నా వాటా నాకిచ్చేస్తే, నేను వెళ్ళిపోతానన్నాడు కృష్ణ. "నీ వాటానా? ఎందులోంచి ఇమ్మంటావ్? అయినా ఇందులో నీదంటూ, నీకంటూ ఏమీ లేదు! అంతా నాదే, ఇక నువ్వు వెళ్ళవచ్చు" అని అర్జున్ అంటుంటే, "మరి ఐదు సంవత్సరాల క్రితం నేనాఫీసులో జాయినయినప్పుడు, ఇందులో లాభమొస్తే యిద్దరం పంచుకుందాం, నష్టమొస్తే నువ్వు ఒక్కడివే భరిస్తానన్నావు కదరా?"

"నువ్వెంత అమాయకుడివో నీకే తెలియట్లేదు కృష్ణ, ఇంకా నువ్వేదో తెలివైన వాడివనుకున్నాను. అయినా నువ్వు చాలాతెలివైన వాడివనే పొగరు కదా నీకు. నిన్ను, నేను నా చిన్నతనంనుండి చూస్తునే ఉన్నాను కదా! నీ తెలివితేటలు ఉపయోగించుకొని, నేను సంపాదించుకున్నాను. కానీ నీకవి ఉపయోగపడకపోతే అది నా తప్పా? నిన్నెవరూ మోసం చేయలేరనే, ఓవర్ కాన్ఫిడెన్స్ తో, గుడ్డిగా ఈ పేపర్ల మీద సంతకం పెట్టావ్. అయినా నేనప్పుడే చెప్పాను 5 సంవత్సరాల తర్వాత నువ్వు వెళ్ళి పోవచ్చునని. కానీ నువ్వే నన్నాశ్రయించి ఉన్నావ్" అంటూ అర్జున్ మాట్లాడటం 5 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చూస్తున్నాడు కృష్ణ

"మన మధ్యనున్న స్నేహం సంగతేంటి?" అని ఈసారి చాలా కోపంగా అడిగాడు కృష్ణ "స్నేహమా? మన యిద్దరి మధ్యా? అని నువ్వనుకుంటే సరిపోతుందా?

ఇంటర్ చదువుతున్న దగ్గర్నుండే నన్ను చూస్తున్నావ్ కదా! ఎప్పుడైనా నీకు, నాకుపడేదా? అనవసరంగా నా డిగ్రీని సంవత్సరం లేటు చేసిన నువెప్పుడూ నాకు శత్రువ్వే అవుతావు గానీ, మిత్రుడివెలా అవుతావురా? డిగ్రీ లో డిబారయ్యానని తెలిసి, మా నాన్న గారు కొట్టడం నేనింకా మరచిపోలేదు. ఎంతో ముద్దుగా చూసుకునే మా నాన్న గారి చేత కొట్టించిన నిన్ను ఎప్పటికైనా పగ సాధించలనుకున్నాను. కానీ నాకు ఆ అవకాశం దొరకలేదు" అని అర్జున్ అన్నాడు.

మరి మా యింటికొచ్చీ మరీ, స్నేహితుడవని, చెప్పావ్? పాతరోజులు మరచిపో, అదంతా గతమంటూ, నన్ను ఎందుకు జాయిన్ చేసుకుని, నాకు ఫ్లాట్, కారు, ఇవన్నీ యిచ్చావు?" అని అశ్చర్యంగా అడుగుతున్న కృష్ణతో " అదా, ఫారెన్‌నుండి ఇండియారాగానే బిజినెస్ స్టార్ట్ చేద్దామని అనుకుంటున్నప్పుడు, నాకు ప్రధాన పోటీ దారు, నువ్వు పనిచేసే కంపెనీ, వాళ్ళను ఎలా డామినేట్ చేయాలని ఆలోచిస్తే, ఆ కంపెనీ అభివృద్ధిలో నువ్వే కీలకం అని తెలిసింది. ఎలాగూ నీ మీద నాకు కోపముండనే ఉంది. డబ్బుకి నువ్వు లొంగవని నాకు తెలుసు. అందుకే నేనే మీ యింటికి వచ్చీ మరీ నిన్ను ఇందులోకి వచ్చేటట్లు చేశాను. నీ కన్నా తెలివైన వాళ్ళు లేరనుకోకు కృష్ణ. దాన్ని నువ్వు స్నేహమని పొరబడ్డావంతే! ఎలాగూ 5 సంవత్సరాల బాండ్ కాబట్టి నువ్వు వెళ్ళవని తెలుసును. ఇక ఫ్లాట్, కారు, ఇవన్నీ ఇచ్చింది నిన్ను పూర్తిగా నమ్మించి, నేను పైకి రావడానికి. ఎలాగూ నువ్వు నిజాయితీ పరుడవని తెలిసే చెక్ పవరిచ్చాను. కానీ నువ్వే వాడుకోలేని మూర్ఖుడివి. అందుకే ఇన్నాళ్ళూ నువ్వు నీ సోంతానికి డబ్బు డ్రా చేస్తే, ఆ నేరం కింద నిన్నేమైనా చేద్దామనుకున్నాను. నువ్వా పని చేయలేదు మై ఫ్రెండ్.

దుర్మార్గుడా! నేను మారిపోయానన్నావు కదరా" అని పళ్ళు కొరుకుతూ కృష్ణ అనగానే, "ఎలా అనుకున్నావు రా! నువ్వు నీ వ్యక్తిత్వంమార్చుకోకుండా ఉన్నావు కదా, మరి నేను మారుతానని అనుకోవడం నీ అమాయకత్వం". అని అర్జున్ అన్నాడు.

మరి అహర్నిశలు కష్టపడి, భార్యా పిల్లల్నికూడా వదిలి మరీ నీ కంపెనీ కోసమే కష్టపడ్డాను కదరా! మర్యాదగా నా వాటా నాకు ఇస్తావా? లేక కోర్టుకెళ్ళమంటావా? అన్న కృష్ణను చూసి వెటకారంగా నవ్విన అర్జున్, నీకెలా చెప్పినా అర్ధం కావటం లేదా? ఇందులో నీకు వాటా లేదని, రాదని." అన్నట్లు పురాణాలు, ఇతిహాసాలు బాగా చదువుకున్నావ్ కదా! ఆ భాషలోనే చెబుతా వినమని అర్జున్ చెబుతుంటే, అసలేం మాట్లాడుతున్నాడో అర్ధం కావడంలేదు కృష్ణకు. అయినా సరే నేను కష్టపడి నీకింత లాభం తెచ్చిపెట్టాను కాబట్టి మర్యాదగా నా వాటా నాకివ్వు"

అని మొండిగా వాదిస్తున్న కృష్ణ తో "ఆగాగు అక్కడికే వస్తున్నా, అశ్వమేధ యాగంలో గుర్రాన్ని వదిలితే ఆ గుర్రం వెళ్ళిన రాజ్యాలన్నీ ఆ గుర్రం వదిలిపెట్టిన రాజువవుతాయి గానీ, నా వల్లే ఈ రాజ్యం వచ్చిందని, ఎప్పుడైనా, ఎక్కడైనా ఆ గుర్రం అడగటం విన్నామా?? నువ్వుకూడా ఆ గుర్రంలాంటి వాడివే! నీ తెలివి తేటలు ఉపయోగించుకున్న నేనా రాజులాంటి వాణ్ణి. ఎక్కడో అడవిలోనో ఇంకెక్కడో ఉండాల్సిన గుర్రాన్ని తీసుకు వచ్చి బాగా అలంకరించి, వెంట చాలా మంది పరివారాన్నిచ్చి పంపించే అశ్వమేధ యాగం కరక్టయితే, నేను చేసిందికూడా నూటికి నూరుపాళ్ళు కరక్టే. రాజ్యం వచ్చింది గుర్రం వలన కదా అని ఆ గుర్రాన్ని బాగా చూసుకోరు సరికదా, యాగం పూర్తి అవగానే దాన్ని చంపేస్తారనికూడా చదువుకున్నట్లు గుర్తు. నువ్వు నేను కలిసి చదువుకున్నాం, 5 సంవత్సరాలు నా క్రింద పనిచేశావనే జాలితో నిన్ను చంపకుండా వదిలేస్తున్నందుకు సంతోషించు. నేను చేసిన ఈ వ్యాపారమనే అశ్వమేధయాగంలో నువ్వు కేవలం "యజ్ఞాశ్వానివి" అని మాత్రమే గుర్తుంచుకుంటే మంచిది. కాదూ, కూడదంటావా, నువ్వు కోర్టుకు వెళ్ళినా కేసు నిలవదు. ఏమీ చదవకుండా సంతకం పెట్టినందుకు, నీదేతప్పంటారు తప్పా, నాకు పోయేదేమీ లేదు, అర్థమైందనుకుంటాను" అనగానే కృష్ణకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అక్కడనుండి బయటికి వస్తుండగానే గీత చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. "డబ్బు సంపాదనలో పడి తానెంత తప్పు చేశానో గుర్తించిన కృష్ణవెంటనే గీత దగ్గరకు వెళ్ళాడు. కళ్ళల్లో నీళ్ళతోటి, జరిగిన అవమాన భారంతో నున్న భర్తను చూడగానే, గీత కూడా క్షమించినట్లుగా కళ్ళతోనే తన భావాలను తెలియజేసింది. ఆడుకుంటున్న వసంత్ నెత్తుకుని ముద్దుపెట్టుకోగానే వెయ్యేనుగుల బలమొచ్చినట్లయ్యింది. మళ్ళీ కొత్త కంపెనీలో జాయినయి దాన్ని నెంబర్-1కు తెచ్చే పనిలోపడ్డాడు కృష్ణ. ఇంకెప్పుడూ తెలివైన వాడిననే అహాన్ని ఎక్కడా ప్రదర్శించలేదతను. ఉన్నదాంట్లోనే సంతృప్తి ఎలా చెందాలో గీతకు బాగా అర్థమైందిప్పుడు.

- మార్చి, 2014

❖ ❖ ❖

6. నిశీధి సంధ్య

(సాహస కథ)

ఉదయం 5 గంటల 29 నిమిషాలకు బంగాళాఖాతంలోని సముద్ర గర్భంలో ఇండియన్ నేవీ ఆధీనంలో ఉన్న ఇంటర్నేషనల్ వాటర్స్ లో గస్తీ తిరుగుతున్న సబ్ మెరైన్లో కమాండర్ "ఉదయ్" తన స్టాఫ్‌తో ఎలర్ట్‌గా ఉన్నాడు. ఫ్లాస్క్ లో ఉన్న కాఫీని గ్లాస్‌లో పోసుకుంటూ రాడార్ వైపు తదేకంగా చూడడాన్ని గమనించి "ఏమయ్యింది సర్" అని ఇంకో కమాండర్ గౌతమ్ అడిగాడు. "సబ్ మెరైన్ కు దగ్గరగా ఏదో ఒకజీవి ఈదుకుంటూ వస్తోంది చూడు" అని చూపించాడు ఉదయ్. "అదేదో చేప అయ్యుంటుంది సర్ ,లైట్ తీసుకోండి" అని గౌతమ్ అంటుండగానే, "కాదు డెఫనెట్గా వచ్చేవారెవరో గానీ "హ్యూమన్ బీయింగ్". ఎందుకంటే మన మెటల్ డిటెక్టర్లో తెలుస్తోంది చూడు. ప్రతీది లైట్ తీసుకోకూడదు, మన డ్యూటీయే అలాంటిది. "త్వరగా వెళ్ళి ఆడైవ్ చేస్తున్నవారిని కస్టడీలోకి తీసుకోండి. ఇట్స్‌మైఆర్డర్" అని ఉదయ్ అన్నాడు. వెంటనేవెళ్ళి సబ్‌మెరైన్‌వైపు వస్తున్న వ్యక్తిని పట్టుకుని ఉదయ్ కు ఇన్ ఫాం చేసారు.

"బీకేర్ ఫుల్ నేను ఇప్పుడే వస్తున్నా" అని వాకీటాకీలో చెప్పి, అటువైపు వెళ్ళాడు. నేవీ సిబ్బంది చుట్టు ముట్టి ఆ వ్యక్తిని డైవింగ్ సూట్లో ఉండగానే ప్రశ్నలు వేస్తున్నారు. "అసలు ఎవరీ వ్యక్తి? ఇంత ఉదయానే డైవింగ్ చేసుకుంటూ మనవైపు ఎందుకు వచ్చినట్టు? బాగా అలసిపోయినట్టున్నాడు" ఇంతమంది ఇలా మాట్లాడుతున్నా ఉలకదు పలుకడేంటి? అసలు బతికున్నాడో లేడో? చూద్దాం" అని ఫ్లోర్లో బోర్లా పడున్న అతన్ని వెలకిల్లా తిప్పారు. డైవింగ్ మాస్క్ ని తీయగానే అక్కడున్న వారంతా స్టనయిపోయారు. ఆ వ్యక్తి మగవాడుకాదు. ఒక అందమైన యువతి. "తన దగ్గరున్న సిలెండర్లో ఆక్సిజన్ కూడా పూర్తిగా అయిపోయింది, తనిప్పుడు దాదాపు స్పృహ తప్పిపోయింది సర్" అని ఒకరు తమ బాస్ ఉదయ్‌కి చెప్పారు.

"ఎవరో ఉగ్రవాదులు తమ వల్లకాక ఇండియన్ నేవీని ఏమీ చేయలేక ఇలా ఈ యువతిని పంపించి మనల్ని ఏమైనా చేద్దామనుకున్నట్టున్నారు బాస్"అని అన్నాడో కమాండర్. "ఆమె ఎవరో తెలియాలంటే ముందామెకు స్పృహ రావాలి. ఆమెకు ముందు ఫస్టెయిడ్ చెయ్యండి, నేనొస్తున్నానని అక్కడికి వెళ్ళి ఆమెని చూసిన ఉదయ్ ఆశ్చర్యపోయాడు. ఈ అమ్మాయి మిస్.. అని ఎవరికీ వినపడకుండా మనస్సులో అనుకున్నాడు. "ఆ అమ్మాయికి తెలివి రాగానే నా క్యాబిన్ కి తీసుకురండి" అని ఆర్డర్ వేసి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి ఎవరో ఏవైనా ఆధారాలు దొరుకుతాయేమోనని మొత్తం అంతా చెక్ చేశారు. ఎటువంటి ఆధారాలు దొరక్కపోవడంతో ఏం చెయ్యాలో తోచలేదు వాళ్ళకి.

"తనని చూసిన దగ్గర్నుండీ బాగా డిస్టర్బ్ అయ్యారు సర్ మీరు? తను మీకు ముందు నుండి తెలుసునా"? అని ఉదయ్ ని గౌతమ్ అడిగాడు. "విషయం అదికాదు గౌతమ్, తనొక్కర్తే , నడి సంద్రంలో దగ్గర్లో ఎటువంటి సహాయం,ఆధారం లేకుండా ఇంతకు తెగించి ఎందుకు అలా మనకు దొరికిందా?" అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఆ అమ్మాయికి తెలివి వచ్చిందని వాకీటాకీలో ఇన్ ఫాం చేశారు. ఆ అమ్మాయి లేచి "నాకేమైంది? నేను ఎక్కడున్నాను? అని ఆశ్చర్యంగా, చుట్టూ చూస్తూ భయంగా అందర్నీ అడిగింది. "భయపడకమ్మా! నీకేం భయం లేదు. నీకు సహాయం చేసే వాళ్ళమే, నువ్వు ఎవరు? ఎక్కడి నుండి వచ్చావ్?" అని అడుగుతూనే మా సర్ దగ్గరికి వెళ్దాం పదండి" అని ఆ అమ్మాయిని తీసుకువెళ్ళారు. అక్కడ వాళ్ళ సార్ ని చూసిన ఆ అమ్మాయి ఉలిక్కి పడింది. "నీకేం కాదులే సంధ్యా! 'కూర్చో కాఫీ తాగు... రిలాక్స్ అవ్వు" అనిచెప్పి, నాకు తెలిసిన అమ్మాయే మీరిక వెళ్ళచ్చు"అని సబార్డినేట్స్ కి చెప్పాడు ఉదయ్.

"సంధ్యా అసలేం జరిగింది? ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది? మీ డాడీ, నువ్వు కలసి వచ్చారా? అతనే మయ్యారు? ప్రాణాపాయ స్థితిలో ఇంత రిస్క్ ఎందుకు చేశావు. ఏం జరిగిందో చెప్పడానికి అభ్యంతరం లేకపోతే చెప్పని" ఉదయ్ అడిగాడు. "నీకు కాకపోతే ఇంకెవరికి చెబుతాను? చిన్ననాటి స్నేహితుడివి నీకు చెప్పడానికి నాకెందుకు అభ్యంతరం? నేనొక ప్రమాదంలో చిక్కుకుని, నాలాంటి వారి ప్రాణాలు కాపాడానికి నడి సంద్రంలోకి దూకాను" అని సంధ్య అనగానే, "మీ నాన్న గారు ఉంటుండగా నీకు ప్రమాదమా? " అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అని అడిగాడతను. "మా నాన్నగారు ఉండుంటే నాకెందుకు ప్రమాదం? నేను ఎం.బి.బి.ఎస్., సెకండియర్‌లో ఉండగానే యాక్సిడెంట్లో పోయారు.

ఇప్పుడు నేను ఫైనలియర్ చదువుతున్నాను. మా అమ్మ నాకేలోటు లేకుండా అన్నీ చూసుకుంటుంది. మా నాన్నగారు స్విమింగ్ కోచ్ అని నీకు తెలుసుగా!. ఒక్కగానొక్క ఆడపిల్ల కావడటంతో నన్ను చాలా గారాబంగా పెంచారు. అయితే నాన్న పోయిన దగ్గర్నుండీ నాఫీజు కట్టడానికి అమ్మ చాలా కష్టపడింది. నన్ను డాక్టర్ చేయాలనే మానాన్నగారి ఆశయం నిలబెట్టాలనే, నా చదువు ఆగిపోకుండా చాలా జాగ్రత్త పడింది. ఎంబీబీయస్ తర్వాత ఎండీ చేయించాలనేది మానాన్నగారి ఆశయం. మామూలుగా కన్నా స్పోర్ట్స్ కోటాలో సులువౌతుందని మా డాడీ చిన్నప్పటి నుండే స్విమింగ్ నేర్పించారు. మాకు బంధువులు కూడా పెద్దగా లేరు. నా ఫీజు గురించి సహాయం చేయాలని ఎవరూ మాట్లాడేవారు కారు. సాఫీగా సాగిపోతున్న మాజీవితంలోకి, మా పక్కింట్లోకి ఆరు నెలల క్రితం అద్దెకు దిగింది "జానకాంతీ".

మా ఇంట్లోకి వచ్చి నా మెడల్స్, మెమెంటోలను చూసి నన్ను తెగ పొగిడేసింది. అయితే ఆర్థిక పరిస్థితి బాగులేని నాలాంటి క్రీడాకారులకు సహాయం చేసే స్వచ్ఛంద సంస్థ ఒకటి ఉందని, వాళ్ళే ఎంట్రీ ఫీజులు కట్టి, రానూపోనూ చార్జీలతో సహా అన్నీ చూసుకుంటారని చెప్పింది. ఎంట్రీ ఫీజులు కట్టలేక ఎన్నో టోర్నీలకు వెళ్ళకుండా ఆగిపోయిన పరిస్థితులు నా విషయంలో ఎన్నో. అందుకని అమ్మను ఒప్పించి ఈసారి ఎక్కడైనా టోర్నీకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. ఈలోగా ఆవిడ ఈ విషయం చెప్పగానే నాకెందుకో ఆశ కల్గింది. పీజీ చదవలేనేమో అనుకున్నప్పుడు ఈవిడ పరిచయం చాలా మంచిదనిపించింది. ముంబైలో స్విమింగ్ కాంపిటేషన్స్ జరుగుతున్నాయని, వాటికి నాపేరు ఆ వాలంటరీ ఆర్గనైజేషన్ సెలక్ట్ చేసింది, ఫ్లైట్లో వెళ్ళి, వచ్చేయడమని జానకాంటీ చెప్పగానే అమ్మ వద్దంది. కానీ నేనే అమ్మను ఒప్పించి, నన్ను విమానం ఎక్కించడానికి వస్తున్న అమ్మను చూస్తూనే ఫస్ట్ టైం ఫ్లైట్ ఎక్కాను.

నాన్న పోయాక ఎవరూ పట్టించుకోని మాకు జానకంటీ పరిచయమవడం వరం అనుకున్నాను. నాపక్క సీటులో కాషాయం రంగు బట్టలలో, చేతిలో జపమాలతో ఒక సన్యాసిని కూర్చుంది. నేను ఆడవాళ్ళలో సన్యాసిని చూడటం అదే ఫస్ట్ టైం. చాలా ప్రశాంతంగా ఏదో జపం చేసుకుంటోంది. ఇంతలో మా ముందు సీట్లో కూర్చున్న గర్భవతికి నొప్పులు స్టార్ట్ అయ్యాయి. ఫ్లైట్ గాలి లో ఉండగా నొప్పులు రావడంతో విమానంలో మిగిలిన వారంతా కంగారు పడ్డారు. అయితే నాపక్క నున్న సన్యాసిని మాత్రం చాలా కూల్ గా ఉంది. నిండు చూలాలిని ఎందుకు తీసుకొస్తున్నావ్" అని వాళ్ళాయన్ని అందరూ తిడుతున్నారు. "డెలివరీడేట్ కింకా టైముందన్నారని" ఆయన జవాబు చెప్పి, ఏం చెయ్యాలో తోచక బిక్కమొహం వేసుకుని చూస్తున్నాడు. మధ్యలో ఫ్లైట్ దించటం కుదరదు. అప్పుడు నేను వెళ్ళి అందర్నీ దూరంగా పంపించి, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను తీసి చూశాను. అందులో డెలివరీకి ఉపయోగపడే టూల్ ఏదీలేదు. నొప్పులు మరీ ఎక్కువౌతున్నాయి, తొందరగా ఏదోకటి చేయకపోతే తల్లికి బిడ్డకి ఇద్దరికీ ప్రమాదమే. భూమ్మీదయితే డెలివరీ సులువే, కానీ గాల్లో కాబట్టి తల్లి మీద గ్రావిటేషనల్ ఫోర్స్ ఎక్కువ ఉండటం వలన సరిపడా నొప్పులను తను ఇవ్వలేక పోతోందని నాకర్థమైంది. కానీ ఏదోకటి చేయాలి. నా అనుభవం లేమి నన్ను వెక్కిరించింది. గొంతు తడారిపోతోంది. కాళ్ళూ చేతులు చెమటలు పోస్తున్నాయి. పేషెంట్ స్పృహ తప్పిపోతోంది. అంత ఎత్తులో ఆమెకు ఆక్సిజన్ లెవెల్స్ అందటంలేదు. చూస్తూ చూస్తూ ఊరుకోవటం తప్పా ఏమీ చెయ్యలేమా అనిపించి ఏడుపొస్తోంది. తల్లిని స్పృహలో ఉంచడానికి నేను చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాక,మెల్లిగా స్పృహలోకి వచ్చింది. నొప్పులింకా వస్తున్నాయి. బాధ భరించ లేకపోతోంది. బి.పి. ఎక్కువయ్యింది. దాన్ని తగ్గించడానికి మాత్రలిచ్చాను. బిడ్డ బతకడం కష్టమనిపించింది.

అంత టెన్షన్లో ఉన్న నన్ను కొంచెం అటు జరగమని, ఆ సన్యాసిని సైగ చేసింది. చేతిలో జపమాల, విభూతిని చూసిన నేను, కోపం ఆపుకోలేక ఎమ్‌బిబియస్ స్టూడెంట్ నైన నేనే ఏం చెయ్యలేకపోతున్నాను, ఆఫ్ట్రాల్ సన్యాసినివి నువ్వేం చేశ్తావంటున్న నా మాటలు పట్టించుకోకుండా, చేతిలో వస్తువులను కింద పడేసి, గర్భవతి పొట్ట మీద చేతులు వేసి చూసి, బిడ్డ తల ఎక్కడుందో చూస్తోంది. "ఇంకొంచెం బిడ్డ కిందకు దిగితే చాలు", అని అంది. "ఆవిడ నొప్పులు ఇవ్వలేకపోతోంది, పిల్ల ఇంకొంచెం కిందకి ఎలా దిగుతుంది?" అని నేనడిగాను. ఫస్టెయిడ్ కిట్ లో బ్యాండెయిడ్ తీసుకుని తల్లి కాళ్ళు దూరం చేసి కట్టి, పాత పద్ధతిలో నడుం కింద ఎత్తుపెట్టగానే గట్టిగా ఒక్క నొప్పితో కడుపుకో బిడ్డ బయటికి వచ్చేసింది. బిడ్డ ఏడుపుతో అందరితో పాటు నేను కూడా నివ్వెరపోయి చూస్తూ చప్పట్లు కొట్టాను. అందరూ నన్నూ ఆవిడను పొగిడారు. "ఒక సామన్య సన్యాసినికి వైద్యంలో ఇంత కిటుకు ఎలా తెలుసు? "అని ఆలోచిస్తుంటే, నా దగ్గరకు వచ్చి, నేనూ ఒక డాక్టర్ నే. ఎం.డి గైనకాలజీ. ఎప్పుడో 12 సంవత్సరాల క్రితం వదిలేసి సన్యాసం తీసుకున్నాన'ని కూల్‌గా చెప్పింది. ఈ సంఘటనలోంచి కోలుకునే లోగానే నేను ముంబైవెళ్ళి తిరిగొచ్చేశాను.

కొన్ని రోజులు పోయాక "ఈసారి దుబాయ్ లో ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ ఉంది, దాంట్లో పార్టిస్పేట్ చేయాలంటే ముందుగా అండమాన్ లో జరిగే పోటీలో గెలవాలి" అని అందుకే అండమాన్‌కు వెళ్ళడానికి షిప్ టికెట్లు బుక్ చేసి తీసుకువచ్చానని జానకాంటీ చెప్పింది. ఆడపిల్లని అంత దూరంపంపటం కుదరదని మాఅమ్మ చెప్పేసింది. "నీ కూతురికేమ్మా! బంగారం. అయినా ఈసారి నేనుకూడా మీఅమ్మాయికి సాయంగా వెళుతున్నాను" అని చెప్పగానే సరేనంది అమ్మ. అలా మొత్తానికి అండమాన్ వెళ్ళే షిప్ వైజాగ్లో ఎక్కేశాం. అయితే అక్కడే నాకు అనుమానం వచ్చింది. ఎవరో నలుగురు గుండాల్లాగా ఉన్న వాళ్ళ దగ్గర్నుంచీ జానకాంటీ డబ్బులు తీసుకోవడం నేను చూశాను. "ఏదో అప్పుల గొడవమ్మా! నీకెందుకులే "అని కంగారుపడుతూ సర్దేసింది.

షిప్‌లో ఇంచుమించు నా వయస్సులో ఉన్న అమ్మాయిలే ఉన్నారు. ఇంకో దగ్గరచిన్న పిల్లలున్నారు, అప్పుడు నాకంతా అర్థమయిపోయింది. "జానకి ఒక మోసగత్తె అని, నేను మోసపోయానని తెలిసి నేనెంత తొందరపడ్డానో అని అనుకున్నాను.కానీ అప్పటికే జరగాల్సిన లేటు జరిగిపోయింది. నాలాంటి అమ్మాయిలను గల్ఫ్ దేశాలకు పంపించే వ్యాపారం అనీ, పిల్లల అవయవాలను అమ్ముకునే దుర్మార్గులనీ అక్కడి వాళ్ళ మాటల వలన తెలిసింది. వెంటనే మా అమ్మకు షిప్ నెంబరుతో సహా మెసెజ్ పంపించేశాను. నాతోపాటే, మిగిలిన వారందరూ అమాయకంగా జానకిలాంటి వాళ్ళ వలలో పడి మోసపోయామని అనుకోవడం విన్న రాక్షసుల్లా ఉన్న నలుగురు, చేతిలో

గన్స్‌తో మమ్మల్ని నోర్మూసుకొని పడుండండి.. మేమెలా చెబితే అలా మీరు ఉండాలని బెదిరించారు. పిల్లలయితే ఏడుస్తూనే ఉన్నారు.

ఇక నాజీవితం అయిపోయిందని ఏడుస్తుంటే అమ్మ గుర్తొచ్చింది. అమ్మ చెప్పిన మాట విని ఉండాల్సిందని ఏడ్చాను. తర్వాత ధైర్యంతెచ్చుకొని మెల్లిగా ఏదైనా చేసి తప్పించు కోవాలని ఆలోచించాను. నడి సముద్రంలో తప్పించుకోవడం అంత తేలిక కాదని మిగిలిన వారందరూ అనుకున్నారు. మాలో చాలా మందికి ఈత రాదని కొందరన్నారు. ఇంకొంత మంది మామూలు ఈతవచ్చు గానీ సముద్రంలో ఈత రాదన్నారు. ఈలోగా ఎవరో వచ్చిన అలికిడికి నిశ్శబ్దంగా ఉన్నాం. వాళ్ళ మాటల వలన షిప్‌లో ఇంకో మూడురోజులు ఉండాలని తెలిసింది. అప్పటికే మా దగ్గరున్న ఫోన్స్ లాగేసుకున్నారు. మా అమ్మ కష్టపడి కొనిచ్చిన నా ల్యాప్ టాప్ కూడా ఒక నల్లని వాడు లాగేసుకున్నాడు.

నేనేదొకటి చేసి మిమ్మల్ని రక్షిస్తానని వాళ్ళందరికీ ధైర్యం చెబితే, చాలా మంది నమ్మలేదు. "అంత ముందు చూపుంటే నువ్వూ మాలాగా మోసపోయేదానివి కాదు కదా!" అని అన్నారు. చీకటి పడుతుంటే నక్కి నక్కి ఆ క్యాబిన్ లోంచి బయటపడ్డాను. ఎవరికంటా బడకుండా,ఒక్కొక్క క్యాబిన్ దాటుకుని కిందన ఉన్న బేస్ మెంట్ చేరుకున్నాను. అందులో కొంచెం ముందుకు నడచి, కుడివైపు తిరిగి ముందుకు వెళ్ళీ మళ్ళీ ఎడమవైపు తిరిగి కొంచెం ముందుకు వెళ్తే ఒక క్యాబిన్లో ఆక్సిజన్ సిలెండర్స్ కనిపించాయి. నాకు ఆశ, ఆనందం రెండూ కలిగాయి. మెల్లిగా వాటి దగ్గరకు వెళ్ళే సరికి ఎవరో వస్తున్నట్లుగా అలికిడి వినిపించి దాక్కున్నాను.

ఎవరూ లేకుండా ఇక్కడ లైట్లెందుకని వాళ్ళా లైట్లు ఆపేసి వెళ్ళిపోయారు. ఆ చీకటికి కళ్ళు అలవాటు పడ్డాక, 'స్క్యూబా ట్యాంక్ '(డైవింగ్ ట్యాంక్)ను భుజానికి తగిలించుకున్నాను. నేను వేసుకున్న హైహీల్స్ వలన శబ్దం వస్తుండటంతో వాటిని అక్కడే వదలి, డైవింగ్ సూట్ పూర్తిగా వేసుకున్నాను. సిలెండర్ లో ఉన్న ఆక్సిజన్‌తో 3 గంటలు బతకవచ్చని నాకు తెలుసు. అందుకే షిప్ ఓపెన్ కేబిన్ దగ్గరకు వెళ్ళి ఒకసారి చూశాను. పున్నమి వెన్నెలతో చంద్రుడిచుట్టూ నక్షత్రాలు హాయిగా ఉన్నాయి. తలకు ఉన్న టార్చ్ ఆన్ చేసి ఒక్కసారి గుండెల నిండా గాలి పీల్చుకొని, ధైర్యం తెచ్చుకుని నడిసంద్రంలోకి దూకేశాను. నాన్నగారు లేకుండా డైవింగ్ చేయడం మొదటిసారి. ఎటువైపు వెళ్ళాలో, ఎంత దూరం వెళ్ళాలో గమ్యంలేని ప్రయాణం చేస్తున్నాను. ఎలాగైనా నేను బ్రతికి నామీద నమ్మకం పెట్టుకున్న అంతమందిని బతికించాలి.

తెల్లవారుఝామున 2.30 నిమిషాలకు నేను దూకాను. 5.30 లోపల నేను సహాయంకోసం ప్రయత్నించాలి. అంతవరకు మాత్రమే నా దగ్గరున్న ఆక్సిజన్ సరిపోతుంది. షిప్ వెళ్తున్న దిశకు వ్యతిరేకంగా, అంటే వెనక్కు ఈదుకుంటూ వెళ్తున్నాను. షిప్ లో నా చెప్పులు చూసిన వాళ్ళు, నేను తప్పించుకున్నానని తెలిసిపోయి చిన్న చిన్న బోట్లలో నన్ను వెతకడానికి బయలుదేరారు. నీళ్ళ మీద తేలుతూ ఈదుతుంటే వాళ్ళకు దొరికిపోవడం ఖాయం. అందుకే డైవింగ్ చేస్తూ ముందుకు వెళ్తున్నాను. సముద్రంలో జీవాలను చూస్తుంటే ఎంతో ఆనందం కలిగింది. వెన్నెలకు ఎట్రాక్ట్ అయి సముద్రం పైకి వచ్చేచేపలు కొన్నైతే, వాటిని తినడానికి వచ్చిన పెద్ద చేపలు కొన్ని. ఇంకొంచెం ముందుకు వెళ్తుంటే ఆక్టోపస్ ను చూశాను. అప్పుడే ఒక చేపను హాంఫట్ చేస్తోంది. నాకు టైం లేకపోవడంతో ముందుకు వెళ్తున్నాను.

ఇంతలో ఒక షార్క్ నేరుగా నాపైకి వస్తోందని చూసి, దాన్నుంచి తప్పించు కోడానికి చాలా ప్రయత్నాలు చేశాను. ఎన్ని చేసినా దానికి నేను దొరికిపోక తప్పదనిపించేలా వెంటాడింది. మధ్యాహ్నం ఎప్పుడో తిన్న తిండి మాత్రమే కాబట్టి ,సిలెండర్ల బరువు మోస్తూ, వాటర్ కరెంట్ కి వ్యతిరేకంగా ఈదటం నావలన కావడంలేదు. వెనకాతల తరుముకొస్తున్న "మృత్యు సొరను" తప్పించుకోడానికి సాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఇంతలో నన్ను వెతుకుతున్న బోట్లలోని మనుషులు, నేను ప్రాణాలతో దొరక్కపోయినా ఫర్వాలేదుకానీ, వాళ్ళ విషయాలు ఎవరితోనైనా చెబుతానేమోనని, నీళ్ళలోకి ఆయుధాలు విసురుతూ గన్లతో ఫైర్ చేస్తున్నారు. అవి నాకు తగలలేదు కానీ, నన్ను వెంటాడుతున్న షార్క్ కి తగిలాయి.

ఇదంతా జరిగే సరికి టైం అయిపోవచ్చింది. ఇంకో పావుగంటలో ఏదో ఒకటి చేయకపోతే నేను ఇంత రిస్క్ చేసి బయటకు రావడం వృథా.ఆక్సిజన్ అయిపోతోంది. ఇంకో 5 నిమిషాలు మాత్రమే వస్తుంది. కాళ్ళలో సత్తువ లేదు. చేతులు వేలాడిపోతున్నాయి.3 గంటలనుండి ఏకధాటిగా ఈదుతుండటంతో నీరసం ఆవహించింది. దాహంతో నాలుక పిడచ కట్టుకుపోతోంది. ఆక్సిజన్ కూడా అయిపోవచ్చింది. నాకున్న ఆప్షన్స్ రెండే. ఒకటి పైకి వెళ్ళివాళ్ళకి దొరికిపోవడం, రెండు నీళ్ళల్లో జల సమాధి అయిపోవడం" అనుకుంటుండగా నడి సంద్రంలో కొండంత ఆశలా మీ సబ్ మెరైన్ కనిపించింది. ఇదీ జరిగింది." నేను మా అమ్మసెల్ కి నెంబరుతో సహా అన్నీ వివరంగా మెసేజ్ పంపాను. మా అమ్మ చూసిందో లేదో""? అని ఉదయ్ తో చెప్పింది. వెరీ గుడ్ సంధ్య. మంచి పని చేశావు. నువ్వు పంపిన మెసెజ్ బట్టి ఆ షిప్ ఎక్కుడుందో మావాళ్ళు కనిపెడతారు. పద నిన్ను సేఫ్ గా ఇంటికి దిగబెట్టి, వాళ్ళ పని పడతాను.

– అక్టోబరు, 2015

❖ ❖ ❖

కథాశ్రీకారం

తెలుగుకథకు ఆధునికయుగంలో శ్రీకారం చుట్టింది గురజాడైనా ఆ జాడలు ప్రాచీన సాహిత్యంలో చాలానే ఉన్నాయి. కథను గురించి తెలియని వారుండరు. 'కథకంచికి' అన్న సూక్తి అందరికీ తెలిసిందే. కథలు లేని మానవజీవితం ఊహలకు అందనిది. ఇతిహాస, పురాణ, కావ్యాలన్నింటిలోనూ కథాంశం ఎంతో కొంత ఉంటుంది. వర్ణనా ప్రాధాన్యమున్న ప్రబంధాల్లో సైతం కథను చూడవచ్చు. సంవిధానంతో కూడిన కథాకథనం ఎంతో క్లిష్టమైందని ఆలంకారికులు అంగీకరించారు. అయితే కథవేరు. వచనరూపంలో ఈనాడు గుర్తింపు పొందుతున్న కథవేరు.

కొన్ని ప్రత్యేకలక్షణాలున్న సంక్షిప్త కథారూపానికి 'కథానిక' అన్న పేరు వాడుకలో ఉంది. నేటి సమాజంలో కథ - కథానిక అన్న పదాలు సమానార్థకాలుగానే ఉపయోగిస్తున్నాం.

అగ్నిపురాణంలో 337వ అధ్యాయంలో కావ్యాది లక్షణ నిరూపణ సందర్భంలోని ఒక శ్లోకం కథానికను గురించి ప్రస్తావించింది. "ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా కథానికేతిమన్యంతే......." ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక అని గద్యకావ్యభేదాలుగా తెలుస్తోంది. ఇందులో ప్రత్యేకంగా కథానిక గురించి చెప్పుకోవాలి.

"భయానకం సుఖపరం గర్భేచ కరుణోరస:
అద్భుతోంతే సుక్లుప్తార్థా శోదత్తా సా కథానికా"

భయానకరసంతో ప్రారంభమై, కరుణరసగర్భితంగా సాగుతూ, అనుకోని మలుపును సూచించే అద్భుతరస ప్రతిపాదితమైన కొసమెరుపుతో కథానిక సమాప్తమౌతుందని సాధరణ లక్షణాలను విమర్శకులు పేర్కొన్నారు. కథను కథానిక అనడమే బాగుటుందని శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి తాను 1936లో రాసిన ఒక వ్యాసంలో ప్రతిపాదించారు.

'సుధీరకథనాలు' కథాసంకలనంలో సోదరుడు వేంకటరాయ శర్మ సంతరించిన కథాంశాలన్నీ పైన చెప్పిన లక్షణాలతో సరితూగుతాయి. విభిన్నమైన ఆరు ఇతివృత్తాల్ని భావనాశక్తితో, చక్కని పాత్రచిత్రణతో, పాఠకుల మన:ఫలకాలపై శాశ్వతచిత్రాన్ని రూపుదిద్దుకొనేలా తీర్చిదిద్దడం ఈ రచయితలోని ప్రధానగుణం. కథాంశాలకు అనుగుణమైన పాత్రల ఎంపిక, ఆ యా పాత్రల స్వభావాలకు తగిన పేర్లు, ఉచితమైన సన్నివేశకల్పనలు, కథాపరమార్థాన్ని ఒకే పదబంధంతో బోధించగల శీర్షిక నిర్ణయం... ఇలాంటి శైలీవిన్యాసాలను ప్రదర్శించడం, పరిమితంలో పరిణితిని దర్శింపచేయడమే. వినీలాకాశంలోని వైచిత్ర్యాన్ని దుర్భిణితో చూపించడమే...! దర్శించండి. ఆస్వాదించండి. వీటిలో కొన్ని పోటీలకు రాసినవి. మరికొన్ని భావావేశంతో పోటీపడిరాసినవి. ఏతావతా ఈ కథలు సామాజికాంశాల్ని చిత్రిస్తూ, కొత్త ఆలోచనలకు నాంది పలుకతూ, పాఠకులల్లో నవచైతన్యాన్ని, కథనకుతూహలాన్ని మరింతగా పెంచుతాయి అనడంలో అతిశయోక్తిలేదు.

కం॥ నవ భావస్ఫురదాఢ్య
స్తవనీయవిభూతిసుగణసాంద్రుండిటులన్
ప్రవిమల 'సుధీర కథలన్'
'కవి' వేంకటరాయశర్మ కథకుండయ్యెన్.

విద్వజ్జనవిధేయుడు
'శతావధాని' రాంభట్ల పార్వతీశ్వరశర్మ

జననం :
24-11-1900

నిర్యాణం :
16-09-1981

జననం :
15-12-1910

నిర్యాణం :
28-12-1995

కీ॥శే॥డా॥రాంభట్ల వేంకటరావు, కీ॥శే॥ రాంభట్ల సూర్య కాంతమ్మ

ఇలువేలుపు వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

డా॥ రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్

(స్థాపితం 2007)

కార్యదర్శి: 'శతావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ, సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం-51. సెల్: 93931 22394

శ్రీమతి రాంభట్ల సూర్యకాంత కామేశ్వరి

సెల్: 9393122394
9247877817

ఎస్.వి.వి. బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మీ అమ్మాయికి / అబ్బాయికి తగిన వివాహ సంబంధం కొరకు వెంటనే మమ్మల్ని సంప్రదించండి. మీరు కోరిన, మీకు కావలసిన అర్హతలు ఉన్న కచ్చితమైన వివాహ సంబంధములు పరిచయం చెయ్యగలము.

శారదాపీఠం రోడ్, సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - 51

website: www.svv.yolasite.com

ఆర్.వి.ఆర్. శర్మ
B.Sc. M.L.T., M.Sc. Microbiology.

సెల్: 998 5243 171
939 3122 394

ఎస్.వి.వి. క్లినికల్ లేబొరేటరీ

మా వద్ద అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయబడును.

శారదాపీఠం రోడ్, సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం-51

రాంభట్ల వేంకటరాయ శర్మ ఎం.ఎ. జ్యోతిషం

సెల్: 99852 43171
86886 16016

ఎస్.వి.వి. రాంభట్ల జ్యోతిషాలయం

అన్ని రకముల జాతకఫలితములు, ముహూర్తములు, ప్రశ్న వాస్తు, గ్రహశాంతి విషయములు చెప్పబడును

శారదాపీఠం రోడ్, సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం-51

అన్ని రకాల తెలుగు D.T.P. WORKS చేయబడును. CELL: 9247859580

DAKJ103B157

రాంభట్ల వేంకటరాయ శర్మ

సీనియర్ రీసెర్చి ఫెలో (Ph.D.), తెలుగుశాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

జన్మస్థలం : శ్రీకాకుళం.

పుట్టినతేది : 17 - 08 - 1987. (ప్రభవనామ శ్రావణ బహుళ అష్టమి)

జననీజనకులు : సూర్యకాంతకామేశ్వరి, కీ.శే. లక్ష్మీనరసింహసోమయాజులు

విద్యార్హతలు : ఎం.ఏ. తెలుగు., ఎం.ఏ. జ్యోతిషం, ఎం.ఎస్‌సి. మైక్రోబయాలజీ
యు.జి.సి. - జె.ఆర్.ఎఫ్. నెట్., ఎ.పి. - సెట్., (తెలుగు)
మెడికల్ లాబ్ టెక్నీషియన్.

అభిరుచులు : సాహిత్యం, జ్యోతిషం.

అముద్రితరచనలు : సమస్య - దత్తపదుల పూరణ, ఎటెన్షన్ ప్లీజ్ (డిటెక్టివ్ నవల)
సంక్రాంతి, దండం దశగుణం భవేత్ (రేడియో నాటికలు)
జాతీయసదస్సుల్లో సమర్పించిన పరిశోధనాపత్రాలు,
సాహిత్య విమర్శనావ్యాసాలు, జ్యోతిశ్శాస్త్రవ్యాసాలు.

చిరునామా : ఫ్లాట్ నెం. 402, సాయిబాలాజీ హోమ్స్,
సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - 530051.
సెల్ : 99852 43171.

ISBN 978-93-5258-898-5

Sathyam 984 999 6538

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	DAKJ103B157
పుస్తకం పేరు	సమీర కథనాలు
తారీఖు	26 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	61
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Madhu
పేజీలు విడదీసినది	Madhu
స్కాన్ చేసినది	Nandini
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good